
సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER
ఆదివారం • 20 జనవరి 2019 | సంపుటి : 21 సంచిక : 176 | ఎడిటర్ : వి.వి.రమణమూర్తి | 8 పేజీలు | వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com /leaderramanamurthy/
www.twitter.com /leaderramanamurthy/



5 లో

అంతేగా.. అంతేగా...



అంతా సర్దుకుంటున్నారు
జెట్ స్పీడ్‌తో చంద్రబాబు



(ప్రత్యేక ప్రతినిధి)

చూస్తూండగానే సార్వత్రిక ఎన్నికలు వచ్చేస్తున్నాయి. లోక్‌సభతో పాటు, రాష్ట్ర శాసనసభకూ ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఏపీలో మొత్తం 25 లోక్‌సభ స్థానాలతో పాటుగా 175 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. రాష్ట్రానికి సంబంధించి తొలి విడతలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అంటే ఎలా చూసుకున్నా గట్టిగా నలభై రోజుల వ్యవధి కూడా ప్రభుత్వానికి లేదు. దాంతో, ముందుగా చంద్రబాబు సర్కార్ తొందరపడుతోంది. విధానపరమైన ప్రకటనలు చేసేందుకు ఇపుడే అన్నీ సిద్ధం చేసుకుంటోంది. చంద్రబాబు ఈ నెల 21 జరిగే మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే సామాజిక పింఛన్లను రెట్టింపుతో పాటు, రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా పేరిట వరాలను ప్రకటించిన చంద్రబాబు ఇపుడు

కొత్త హామీలతో వైసీపీ
కమిటీలతో జనసేన

మరో అడుగు ముందుకేసి రైతు బంధు తరహాలో పథకాన్ని ప్రకటిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధానంగా సన్నకారు, కౌలు రైతులను లక్ష్యంగా చేసుకుని భారీ నగదు ప్రయోజనం కలిగించే విధంగా ఈ పథకం ఉంటుందని చెబుతున్నారు. దీని ద్వారా రైతాంగాన్ని మచ్చిక చేసుకోవడంతో పాటు, ఎన్నికలలో గెలిచేందుకు సులువు అవుతుందని కూడా భావిస్తున్నారు. అదే విధంగా మరిన్ని పథకాలతో పాటు, రాయితీలు, వెసులుబాట్లు అన్నీ కలిపి ఓటాను అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించాలని కూడా చంద్రబాబు ఆలోచిస్తున్నారు. దీనికి సంబంధించి పెద్దఎత్తున కసరత్తు జరుగుతోంది. ఇక, ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలుకావడంతో ఇతర ప్రధాన పార్టీలు ఇప్పటికే ఎన్నికల కార్యాచరణ ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఎన్నికల వరాలు ప్రకటిస్తున్నాయి మరోవైపు వైసీపీ కూడా ఎన్నికల హామీలకు పదును పెడుతోంది. తాము ప్రకటించిన నవరత్నాల నుంచి ఇప్పటికి రెండు హామీలను కాపీ కొట్టి మరీ చంద్రబాబు అమలుచేస్తున్నారని

మిగతా 2లో



మన చేపలతో ముప్పే !



బీహార్‌లో నిషేధించారు

(ప్రత్యేక ప్రతినిధి)

వివిధ జిల్లాల నుండి చేపల నమూనాలను యాధృచ్ఛికంగా సేకరించాలని బీహార్ ప్రభుత్వ సంస్థలు తాజాగా నిర్ణయించాయి. కొన్ని రకాలైన రసాయనాలు ఉపయోగించడం వల్ల మన చేపలు తినడం వల్ల కాన్సర్ వచ్చే అవకాశాలు ఉండవచ్చనే ఆందోళనలతో ఆంధ్రప్రదేశ్ నుండి తెచ్చిన చేపల అమ్మకాలను బీహార్ నిషేధించింది. బీహార్ రాజధాని నగరమైన పాట్నాలో ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చిన కొన్ని సరకుల్లో ఫార్మాలిన్ కనుగొనడంతో ఈ నిషేధం 15 రోజులు విధించబడింది. నిజానికి ఫార్మాలిన్ అనే క్యాన్సర్-ప్రేరిత రసాయనాలను చేపలను కాపాడటానికి ఉపయోగిస్తారు అలాగే, మృతదేహాలను కాపాడటానికి కూడా ఉపయోగిస్తారు. బీహార్ హెల్త్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ సిన్హా దీనిపై మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి చేపల అమ్మకం, నిల్వ, రవాణా, అలాగే పశ్చిమ బెంగాల్ నుంచి తీసుకొచ్చిన చేపలు, ఫార్మాలిన్ భారీ ఖనిజాలు, కాడ్మియం లాంటి వస్తువులతో కలిపి ఎగుమతి చేయటం వంటి వాటిని గుర్తించి బీహార్ ప్రభుత్వ సంస్థలు ఇప్పుడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి చేపల నమూనాలను యాధృచ్ఛికంగా సేకరించాలని నిర్ణయించాయి ఈ మేరకు వాటికి పరీక్షలు జరిగాయి. పరీక్షలు సానుకూలంగా కనిపిస్తే ఈ నిషేధం రాష్ట్ర వ్యాప్తంగానే విధించబడుతుందని సిన్హా పేర్కొన్నారు. పాట్నాలోని ఆంధ్రా చేపలను విక్రయించడాన్ని, నిల్వ చేయడాన్ని నిషేధించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ, పాట్నా మున్సిపాలిటీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని టిఎంఎంకి చెందిన ఒక అధికారి తెలిపారు. "కోల్‌కటా, పోర్ట్ టెస్టింగ్ లాబొరేటరీ పరీక్షలు నిర్వహించిన తరువాత, పాట్నా నగరంలోని వివిధ స్థానిక మార్కెట్ల నుండి చేప నమూనాలను ఫార్మాలిన్ కలిగి ఉందని కనుగొన్నారు. అందువల్ల పాట్నా మునిసిపాలిటీ ఆంధ్ర నుండి చేపల అమ్మకం మరియు పరిరక్షణకు నిషేధించింది, "అని ఆయన తెలియచేశారు. పాట్నాకు ఆంధ్ర చేపల దిగుమతులను నిషేధించాలన్న బీహార్ ప్రభుత్వ నిర్ణయం తరువాత, ఆంధ్రప్రదేశ్ చేపల కొనుగోలు దారుల్లో ఒకరు జార్ఖండ్, ఆరోగ్య నమూనాలను సేకరించడం, పరీక్షలను నిర్వహించడం, అప్రమత్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ యొక్క ఫిషింగ్ ఎగుమతుల యొక్క దిగుమతి అమ్మకం నిషేధం అన్నది మొదటిసారి కాదు. ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకున్న చేపలపై అస్సాం, మేఘాలయ, నాగాలాండ్ వంటి

మిగతా 2లో



శబరిమలలో మళ్లీ గడబిడ
దర్శనానికి ఇద్దరు మహిళల యత్నం

తిరువనంతపురం: ఇటీవల 50ఏళ్లలోపు వయసు గల ఇద్దరు మహిళలు మగవేషంలో వెళ్లి శబరిమల అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకునేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. తాజాగా వారిద్దరూ మరోసారి ఆలయానికి వెళ్లేందుకు యత్నించారు. అయితే ఈసారి కూడా భక్తులు అడ్డుకోవడంతో పోలీసులు ఆ మహిళలను వెనక్కి పంపించారు. శనివారం ఉదయం షానిలా సతీశ్, రేష్మా నిషాంత్ అనే ఇద్దరు మహిళలు శబరిమల ఆలయాన్ని దర్శించుకునేందుకు నీలక్కల్ బేస్ క్యాంప్కు చేరుకున్నారు. అయితే అక్కడ వీరిని ఆందోళనకారులు గుర్తించి అడ్డుకున్నారు. తమకు భద్రత కల్పించాలని వీరు పోలీసులను కోరారు. అయితే ఉద్రిక్త పరిస్థితుల ద ృష్ట్యా ఇప్పుడు తాము భద్రత కల్పించలేమని వెల్లడించి ఆ మహిళలను పోలీసులు బలవంతంగా వెనక్కి పంపించారు. గత బుధవారం కూడా వీరిద్దరూ అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. షానిలా, రేష్మ మరో ఏడుగురు పురుషులతో కలిసి మగవేషంలో శబరిమలకు కాలినడకన బయల్దేరారు. అయితే నీలక్కల్ బేస్ క్యాంప్కు చేరుకోగానే వీరిని ఆందోళనకారులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు కల్పించుకుని వారిని తిరిగి పంబ పోలీస్ కంట్రోల్ రూంకు తీసుకొచ్చారు.

ఏటికి ఎదురీత ఎన్నాళ్లు
రెండు గ్రామాల రైతులకు తప్పని అవస్థలు
వర్షాకాలంలో మరిన్ని అవస్థలు.. పట్టించుకోని నాయకులు, అధికారులు



చోడవరం, న్యూస్‌లీడర్: కాలాలు మారుతున్నా కొంతమంది రైతులు కష్టాలు మారలేదు. ఇది మండలంలోని చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాలకు చెందిన రైతుల దీన స్థితి.రెండు గ్రామాలకు చెందిన రైతుల భూములు, పశువుల పాకలు, ఇతర పంట పొలాలన్నీ పెద్దేరు నది అవతల ఉన్నాయి. దీంతో వీరు తమ పొలాలకు వెళ్లాలంటే నది దాటాల్సిందే. అయితే పెద్దేరు నదిలో దిగువ ప్రాంతంలో అధికంగా ఇసుక తవ్వకాల వలన ఈ ప్రాంతంలో లోతు ఎక్కువుగా ఏర్పడింది. సుమారు 20అడుగులకుపైగా నీరు ఏ కాలమైనా నిల్వ ఉంటుంది. గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంగా నది అవతల పాకలు ఉన్నాయి. రైతులు నది ఒడ్డున తమ బట్టలు విప్పుకొని ఊసపై వేలాడుతూ అవతలకు చేరుతారు. వీరు నది దాటేందుకు రైతులంతా అటువైపు ఒక చెట్టుకు , ఇవతల వైపు మరొక చెట్టుకు ఇనుప ఊసను కట్టారు. అధికంగా నీరు ఉన్నప్పటికీ ఊసపై వేలాడుతూ ప్రాణాలకు తెగించి వెళుతుంటారు. ఊస తెగిన, పట్టు తప్పిన వీరి సంగతి అంతే నది దాటకుండా వెళ్లాలంటే సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంటుంది. అంత దూరం నడవలేక ప్రాణాలకు తెగించి వెళతారు. ప్రతి రోజు

మిగతా 2లో

మోడీని దించడమే లక్ష్యం
కోల్‌కతాలో విపక్షాల ర్యాలీ



కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాల ఐక్యతను చాటిచెప్పేందుకు పశ్చిమ్‌బంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చిన భారీ ఐక్యతా ర్యాలీ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానం వేదికగా జరిగే ఈ బహిరంగసభకు విపక్ష పార్టీలకు చెందిన పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వేదిక వద్దకు చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ర్యాలీకి హాజరయ్యేందుకు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం కుమారస్వామి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా తదితరులు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. వీరిని మమతాబెనర్జీ సాదరంగా స్వాగతించారు. వేదిక వద్దకు చేరుకున్న పాటిదార్ నేత హార్దిక్ పటేల్, జిగ్నేశ్ మేవాని, ఝార్ఖండ్ ముక్తి మోర్చా వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తృణమూల్ కార్యకర్తలతో సభా ప్రాంగణం నిండిపోయింది.

ఫెడరల్ ఫ్రంట్.. అదొక శూన్యం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు భాజపా నేతలు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. 29సార్లు ఢిల్లీ వెళ్తే మొండిచేయి చూపడమే ప్రత్యేక ప్రాధాన్యమా? అని ఆయన ప్రశ్నించారు. గాయాలపై కారం చల్లడమే

మిగతా 2లో

23,24 న నిరుద్యోగులకు జాబ్‌మేళా 3 లో

'గీత' మారుతుందా 6 లో

వచ్చే ఐదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి
తెలంగాణా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం




హైదరాబాద్: ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారం అయిందని గవర్నర్ నరసింహన్ అన్నారు. రెండోసారి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారిగా ఉభయసభలను ఉద్దేశించి ఆయన శనివారం ప్రసంగించారు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు నరసిం హన్ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి రంగానికి అధిక ప్రాధా న్యం ఇచ్చి ప్రభుత్వం ముందుకు సాగుతోం దని.. విద్యుత్ కోతలను అధిగమించి ప్రభుత్వం తొలి విజయం సాధించిందని చెప్పారు. పారిశ్రామిక, ఐటీ రంగంలో పారదర్శక విధానాలు అమలవుతు న్నాయని గవర్నర్ అన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టు లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వివరించారు.

జగమేమాయ!



నా దక్షిణ అక్షరాల లక్ష!
సింహాచల దేవస్థాన అర్చకులను డిమాండ్ చేస్తున్న పర్యవేక్షకుడు



మంత్రి గారి మనిషినని బుకాయింపు

సింహాచలం, న్యూస్‌లీడర్: సింహాచలం దేవస్థానంలో ఈ మధ్యనే ఆలయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆ పర్యవేక్షకుడు అర్చకుల ప్లేట్ కలెక్షన్‌పై కన్నుపడింది. మీకు జీతాలు వొస్తున్నాయ్.. భక్తులు మీ పళ్ళెంలో వేసిన సొమ్ము హుండీలో వెయ్యండి. లేకపోతే సస్పెండ్ చేసేస్తా... అంటూ హుకుం చలాయించేస్తున్నాడు. ఇది మంచి పనేకదా, హుండీలో డబ్బులు వేస్తే... స్వామికేకాద చెందుతాయి అనుకుంటే పొరపాటే! ఆ అధికారి దేవాలయ అర్చకులకు తాను విధులలో జాయిన్ అయినప్పటినుండి నెలకు ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని హుకుం జారీ చేశాడట? అంతేకాదు అందుకు తనకు నమ్మకంగా ఉన్న ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని గర్భగుడిలో పెట్టి ప్లేట్‌లో భక్తులు వేస్తున్న సొమ్మును హుండీలో వేయించేస్తున్నాడు. దీనిపై ఆలయ అర్చకులు ఆ అధికారితో వాగ్వివాదానికి కూడా ఈ మధ్య దిగినట్లు



తెలిసింది. అంతే తనవద్దకు వచ్చిన కొంతమంది అర్చకులతో, నాకు నెలకు ఒక లక్ష ఇవ్వాలంటూ, నేను డబ్బులు ఖర్చుపెట్టి రాష్ట్ర మంత్రి, మంత్రి పి.ఎ చేత చెప్పించుకొని ఈ పోస్ట్ వేయించుకోవడం జరిగిందని, అందువలన నన్ను ఎవరు ఏమీ చేయలేరని దబాయించేశాడుట!

రెండు నెలలుగా మాములు బాగోతం..

నెల, రెండు నెలలు పైగా ఈ మాములు బాగోతం నడుస్తున్నట్లుగా ఉద్యోగులు, వైదిక వర్గాలు చర్చించుకుంటున్నాయి. అంతే కాదు, ఈ మధ్యలో ఒకరిద్దరు రిటైర్ అవుతారు. ఈవో కూడా బదిలీపై వెళ్లిపోతారు. ఇక అంతా నాయిస్తాను సారమే

మిగతా 2లో

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్

విశాఖపట్నం | ఆదివారం 20-1-2019

మోదీని దించడమే లక్ష్యం



(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకతా ? అని నిలదీశారు. తెలుగుదేశం పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, గ్రామ, మండల, రాష్ట్ర పార్టీ బాధ్యులతో 'ఎలక్షన్ మిషన్- 2019'పై చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కోల్‌కతా ర్యాలీకి 20కి పైగా పార్టీల నేతలు పాల్గొంటే.. భాజపాయేతర పక్షాల్లో తెరాస అధినేత కేసీఆర్, వైకాపా అధ్యక్షుడు జగన్ హాజరుకావడంలేదన్నారు. వీరిద్దరూ ప్రధాని మోదీ వెంటే ఉన్నారన్నది సుస్పష్టమవుతోందని చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ అసలు లేదు.. అదొక శూన్యం మాత్రమేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మోదీకి మద్దతు కోసమే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారని చంద్రబాబు అన్నారు. అది భాజపాకు ప్రతిపక్షమే కాదని విమర్శించారు. రాష్ట్రంపై తెరాస నేతల ద్వేషాన్ని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని చంద్రబాబు సూచించారు. తెరాసతో అంటకాగుతున్న ప్రతిపక్ష నేత జగన్ వైఖరిని ఎండగట్టాలని నేతలకు పిలుపునిచ్చారు. వరంగల్‌లో రాళ్లేసిన వాళ్లతో జగన్ లాలూచీ పడ్డారని విమర్శించారు. కేసుల కోసం మోదీతో, అక్రమాస్తుల కోసం కేసీఆర్‌తో జగన్ లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

డబ్బు పెట్టే అభ్యర్థులను వైకాపా వెతుకుతోందని, ఆ పార్టీ అభ్యర్థులెవరూ ప్రజల్లో ఉండేవారు కాదని చంద్రబాబు విమర్శించారు. భాజపా దేశంలోని ఆలయాల్లో అశాంతిని సృష్టిస్తోందని.. దీనికి శబరిమలలో ఉద్రిక్తతలే ఉదాహరణగా చంద్రబాబు చెప్పారు. కర్ణాటకలో భాజపా దుర్మార్గపు రాజకీయాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెదేపా చరిత్రాత్మక విజయం సాధించాలన్నారు. ఓటర్ల జాబితా అందరికీ అందుబాటులో ఉంచామని.. మార్పులు, చేర్పులపై అంతా శ్రద్ధ చూపాలని కోరారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను చంద్రబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో 25 పార్లమెంటు, 150 శాసనసభ స్థానాల్లో ఘన విజయం సాధించేలా అంతా సమష్టిగా పనిచేయాలని ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు.

నా దక్షిణ అక్షరాల లక్ష !



(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుంది. నేను చెప్పినట్లు చెయ్యవలసిందే.. అంటూ అలా కానిపక్షంలో విధులలో కూడా ఆబ్సెంట్ వేయడమే కాకుండా, జీతాలు కూడా కట్ చేయిస్తాను అంటూ మరోమారు హెచ్చరించినట్లు తెలిసింది. ఐనా అర్చకులు నో అన్నట్లు... వెంటనే రంగంలోకి దిగిన ఆ అధికారి గతవారం పదిరోజులుగా ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని గర్భగుడిలో, ఇతర దేవాలయాల వద్ద పెట్టి దౌర్జన్యంగా హుండీలో వేయించేస్తున్నాడు. అర్చకుని ప్లేట్‌లో వేస్తున్న సొమ్ము విషయంలో ఒకరిద్దరు భక్తులు అక్కడ సిబ్బందితో వాగ్వివాదానికి దిగినట్లు కూడా తెలిసింది. స్వామికి హుండీలో వేశాం.. ప్లేట్ లో వేసినవి అర్చకులు తీసుకోవడానికి వేశాం. బ్రహ్మణునికి తృణమో, ఫణమో ఇవ్వడం మా భక్తులకు ఆనవాయితీగా వొస్తోందని, మీరెవరు అడ్డదానికని అన్నట్లుగా తెలుస్తోంది. అంతేకాదు ఈయన గారి చరిత్ర తెలిస్తే ముక్కున వేలేసుకుంటారు. ఈ అధికారి ఒక భూమి అమ్మకం విషయంలో కోట్లాది రూపాయలు దండుకొని, ముందు ఒకరికి అమ్మి, అదే భూమిని వేరొకరికి అమ్మినట్లుగా తెలిసింది. అంతేకాదు, దేవస్థానం భూముల విషయంలో గతంలో ఒకసారి సస్పెండ్ కూడా అయ్యాడు. ఆ కేసు ఇంకా ఎదుర్కొంటున్నాడు. అంతే కాదు తనకు నచ్చిన సీటు ఏ ఈవో వెయ్యకపోతే, ఏదో ఒక నెపంతో నెలల తరబడి సెలవులు పెట్టేస్తాడు. అధికారులు కూడా అందుకు వంతపలుకుతున్నారు. దీనితో పాటు దేవాలయాల ఉద్యోగుల సంఘంలో ఒక నాయకుడు కూడా తృణమో, పణమో తీసుకొని ఈవో లకు ఈయనగారి గురించి రికమెండ్ చేస్తున్నాడు. దీనితో ఒక ప్రక్క మంత్రి, పి.ఏ. అండదండలు, మరోప్రక్క ఈవో, సంఘం నాయకుడు కూడా సపోర్ట్ చెయ్యడంతో మరింతగా రెచ్చిపోయి బ్రాహ్మణ వైష్ణవు స్వాములపై రెచ్చిపోతున్నారు. ఇటువంటి వ్యక్తుల ఆగడాలకు అధికారులు అడ్డుకట్టవేయకపోతే, ఆలయ సంప్రదాయాలు, ఆచారాలు మంట కలసిపోయే పరిస్థితి నెలకొంటోందని భక్తులు, సిబ్బంది వాపోతున్నారు.

అంతేగా.. అంతేగా..

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా, రైతు బంధు పథకం కూడా తమదేనని చెబుతున్నారు. ఇలా వీటిని క్లెయిం చేసుకుంటూనే జగన్ పాదయాత్ర సందర్భంగా వచ్చిన వినతులు, సలహా సూచనలతో మరిన్ని కొత్త హామీలను ఇచ్చేందుకు కూడా వైసీపీ సిద్ధపడుతోంది. దానితో పాటుగా, ఈసారి సరికొత్తగా ప్రతీ నియోజకవర్గానికి ఒక ఎన్నికల ప్రణాళికను అందించాలనుకుంటోంది. ఈ విధంగా ప్రజలను తమ వైపునకు తిప్పుకోవాలని ఆ పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఇంకోవైపు జనసేన పార్టీ పార్లమెంరీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు కసరత్తు చేస్తోంఇ. ఇప్పటి నుండి ప్రతీ రోజు కీలకం కావటంతో రాష్ట్రంలోని అన్ని పార్టీలు కౌంట్ డౌన్ ప్రకటించాయి. ఇదిలా ఉండగా, ఈసారి లోక్‌సభ ఎన్నికలతో పాటుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీల ఎన్నికలు కూడా జరిపే అవకాశం ఉందంటున్నారు. . 2014లో తొమ్మిది దశల్లో ఎన్నికలు జరిగాయి. మార్చి 5న ప్రకటన వెలువడింది. తొలిదశ ఏప్రిల్ 7న, చివరి దశ పోలింగ్ మే 12న జరిగాయి. రాష్ట్ర విభజన కారణంగా 2014 లో తెలంగాణలో ఏప్రిల్ 30, ఏపి లో మే7న ఎన్నికలు జరిగాయి. కాగా, మే 16న ఫలితాలు వెల్లడయ్యాయి. ఈసారి ఏపీలో అసెంబ్లీకి ఎన్నికలు ఈ సారి ఏపి లో లోక్‌సభ తో పాటుగా అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉండటంతో.. ఏపి లో తొలి విడత లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈశాన్య రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు భద్రతా సిబ్బంది ఎక్కువగా వినియో గించాల్సిన అవసరం ఉండటంతో పాటుగా ఒకే విడతలో అక్కడ ఎన్నికలు నిర్వహించే వీలు ఉండదని చెబుతున్నా రు. దీంతో తొలి విడతలోనే ఏపిలో ఎన్నికలు ముగించటం ద్వారా ఇక్కడి బలగాలు ఆ ప్రాంతాలకు తరలించే వీలు ఉంటుందని చెబుతున్నారు.

బ్రాండిక్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అచ్యుతాపురం : స్వచ్ఛ్ బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 55.వ. స్వచ్ఛ బ్రాండిక్స్ క్లీన్ అండ్ గ్రీన్ శనివారం జరిగింది బ్రాండిక్స్ నిర్వహించే "స్వచ్ఛ బ్రాండిక్స్" లో హౌస్ కీపింగ్ స్టాఫ్ తో పాటు బ్రాండిక్స్ ఇండియన్ పార్టనర్ దొరస్వామి పాల్గొన్నారు మిగిలిన కొద్ది ఉద్యోగులు కూడా అందులో పాల్గొని మెయిన్ గేట్ నుండి ఏపీఐఐసీ కార్యాలయం వరకు చుట్టుపక్కల పరిసరాలన్నీ కూడా చెత్తాచెదారాన్ని తీసివేసి పిచ్చి మొక్కలు తొలగించడం జరిగింది. ఈ విధంగా ప్రతీ శనివారం చేయడం వలన బ్రాండిక్స్ సంస్థ మెయిన్ గేట్ నుండి చుట్టుపక్కల కిలోమీటర్ పరిసరాల వరకు దాదాపుగా చాలా పరిశుభ్రంగా ఉండడానికి దోహద పడుతున్నది. ప్రతి ఒక్కరు కూడా వారి ఇంటి చుట్టుపక్కల ఉన్నటువంటి పరిసరాలని ప్రతి ఉద్యోగి శుభ్రంగా ఉంచుకోవాలి ని. నినాదంతో స్వచ్ఛ బ్రాండిక్స్ కార్యక్రమం ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రతి ఒక్కరూ తమ తమ వారు ప్రదేశాల్లో చుట్టుప్రక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు బ్రాండిక్స్ ఉద్యోగులు. ప్రతి శనివారం ఇందులో అందరూ భాగస్వామ్యులు కావాలని బ్రాండిక్స్ ఇండియన్ పార్ట్నర్ దొరస్వామి పిలుపునిచ్చారు.

మరిడిమాంబ ఉత్సవాలను విజయవంతం చేయండి



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ ఎన్నో వందల సంవత్సరాల నుంచి చిన్న వాల్తేర్ లోని రెల్లి వీధి లో వెలసియున్న శ్రీ మరిడిమాంబ అమ్మవారి మహోత్సవాలను ఈ సంవత్స రం జూన్ ఆఖరి వారం నుంచి జూలై మొదటి వారం వరకు గ్రామ ప్రజల, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించనున్నట్లు. చిన్నవాల్తేర్ లోని రెల్లివీధి గ్రామ సంఘ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. గౌరీశంకర్ పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా తమ గ్రామ దేవతకు పేరు ప్రతిష్టలు నలుమూలలకు వ్యాపించి ఉన్నాయి అన్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి ఎందరో భక్తులు అమ్మవారిని దర్శించి తరిస్తుంటారన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విశాఖ తూర్పు నియోజ కవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ని, విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ మల్ల అప్పలరాజు ని, జీవీఎంసీ 17వ వార్డు టిడిపి పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నారెడ్డి ను, చిన్న వాల్తేరు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయ చైర్మన్ గణ రమేష్, ఆలయ ట్రస్టీ కోన నాగేశ్వరరావు, 18 వ వార్డు సామాజిక కార్యకర్త కోన చిన్న రావు లను, మరి కొంతమంది నగరానికి చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నా మని, ఈ ఉత్సవాల్లో వి ద్యుత్ దీప అలంకరణలు, కోలాటం, సేవ గరిడి, ఆర్కె స్ట్రాలు, నేల వేషాలు, పగటివేషాలు, డాన్సులు, సంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమ తులను కూడా అందించనున్నామని రెల్లి వీధి కుల పెద్దలు చెన్న దాసు, కుప్పిలి నారాయణ రావు, చెన్నా నాగరాజు, ఆకుల గోవిందరావు, సాయి, చెన్నా కనకరత్నం, రమేష్, యన్. రామకృష్ణ, ఆకుల మూర్తి ఆకుల బాబురావు, మోహన్, కుప్పిలి ధర్మారావు తెలిపారు

ఎదురీత ఎన్నాళ్లు



(మొదటిపేజీ తరువాయి)

ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులకు పాలు తీసేందుకు, పొలం పనులు చేసుకొనేందుకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల ఎగువ ప్రాంతంలో కొంతమేర ఇసుక మేటలుఏర్పడటంతో నీటి లోతు తగ్గింది.దీంతో మహిళా రైతులు, వృద్ధులు కొంచెం దూరం ముందుకు వెళ్లి పదిలె దిగి ఒడ్డుకు చేరుకుంటారు. వర్షాకాలంలో వీరి ఇబ్బందులు వర్ణించలేం. మహిళలు సైతం ఊస పట్టుకొని దాటాల్సిందే. దీంతో మగవారి సహకారంతో వెళుతుంటారు. పంట భూములన్నీ అవతల వైపు ఉండటంతో వెళ్లడం తప్పలేదన్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు విశాఖ డెయిరీ సహకారంతో బ్రెయిలీ వంతెన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే అధికారులులేకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. రెండు గ్రామాలకు చెందిన 150నుంచి 200మంది వరకూ రైతులు పొలాలు అవతల ఉన్నాయి. కనీసం రెండు గ్రామాలకు కలిపి ఒకే చోట వంతెన నిర్మించాలని పలువురు రైతులు కోరులున్నారు.

వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో నూతన నియమాకాలు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ బి.సి.సెల్ ఇంఛార్జిగా నియమితులు అయిన సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె.కె.రాజు గారిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన బొడ్డేటి. గంగా మహేష్,వార్డు అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

మన చేపలతో ముప్పే !

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర-తూర్పు రాష్ట్రాలు కూడా నిషేధం విధించాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయా ప్రభుత్వాలకు దీనిపై లేఖ రాశారు అధికారులు, ప్రభుత్వాలతో చర్చలు జరిపిన తరువాత, అస్సాం రాష్ట్రంలో చేపల అమ్మకాలను పునరుద్ధరించారు. పాట్నాలో చేపల నిషేధం గురించి టిఎస్ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిషరీస్ డిప్యూటీ కమీషనర్ రామ శంకర్ నాయక్ ని సంప్రదించినప్పుడు, "బీహార్ అధికారుల ద్వారా ఆంధ్ర చేప మీద విధించిన నిషేధం గురించి తెలిసిందని అన్నారు. ఏపీలో చేపల సంరక్షణ గురించి అనుసరించే ప్రక్రియను పర్యవేక్షించేందుకు పర్యవేక్షించేందుకు సంబంధిత రాష్ట్ర అధికారులకు లేఖ రాస్తున్నాం "అని ఆయన చెప్పారు. చేపల ఎగుమతి (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారులతో సహా రాష్ట్ర చేపల పెంపకం మరియు ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని నాయక్ చెప్పారు. "కొన్ని ధృవీకరణ పూర్తయిన తర్వాత మాత్రమే వ్యాపారులకు వారి చేపలు ఎగుమతి చేయడానికి తాము అనుమతించామని చెప్పుకొచ్చారు. అందువల్ల ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు పునరాలోచన చేసుకుని నిషేధాన్ని ఎత్తేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేబినెట్ సమావేశంలో సమస్యలు పరిష్కరించాలి

ఎపీ నిరుద్యోగ జెఏసీ డిమాండ్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఈనెల 21న జరగబోయే క్యాబినెట్ సమావేశంలో తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ నిరుద్యోగ జెఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ 14 యూనివర్సిటీల అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు వ్యతిరేకంగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షకు అర్హులైన వారితోపాటు ఎపి సెట్, యుజిసిసెట్, పిహెచ్‌డి, పిడిఎఫ్ లను ఇంటర్వ్యూకు పిలవాలని. గ్రంధాలయ శాఖలో తక్షణమే ఖాళీలు భర్తీ చేయాలని, యుజిసిసెట్ 2019లో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగార్హత కల్పించాలనేవి ప్రధాన డిమాండ్లుగా తెలిపారు.

వైఫల్యాలపై విచారణ జరిపించాలి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్‌లో తరుచు ఉత్పత్తికి అంతరాయం కల్గుతున్న కారణంగా కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతోందని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి వైటీదాసు అన్నారు. గత కొంతకాలంగా వరుసగా జరుగుతున్న ఉత్పత్తిలో జరుగుతున్న వైఫల్యాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్మాగారంలో క్యాపిటల్ రిపేర్లు జరిగి సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయి ఉత్పత్తి అవటంలేదన్నారు. ఇటీవల తలెత్తినలోపాల కారణంగా శీతలీకరణ స్థాయి పడిపోయి పెను ప్రమాదం నుంచి బయట పడిందన్నారు. బీఎఫ్ 3లో తలెత్తిన లోపం కారణంగా బ్లోపైప్ పగిలిపోవడంవల్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఈ లోపాల కారణంగా కార్మాగారంలోని యంత్రాలు, వాహనాలు కాలిపోతున్నాయన్నారు. వరుసగా ఏర్పడుతున్న వైఫల్యాల కారణంగా ఉత్పత్తి కుంటుపడడమేకాక యాజమాన్య సమన్వయలోపం, పనుల్లో నాణ్యతాలోపాలు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుమార్లు లోపాలు సవరించాలని విజ్ఞాపనాపత్రాలు అందచేసినా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి భవిష్యత్తులో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి గంటా



భీమిలి : భీమిలి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజక అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి కల్నల్ హోదా

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి నాగేశ్వర రావుకు మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ నుంచి కల్నల్ హోదా లభించింది. ఈ సందర్భంగా లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ విధనరాజు, ఏయూ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) ప్రెసిడెంట్ డాక్టర్ కె అర్జునుడు, డాక్టర్అలీ, డాక్టర్ హరిబాబు పుష్పగుచ్ఛం అభినందించారు



డిపోమేనేజర్ దివ్యను అరెస్ట్ చేయాలి

○ విశాఖ జిల్లా దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతి పత్రం అందిస్తున్న సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సింహాచలం డిపోకు చెందిన దళిత డ్రైవర్ చింతా నాగేశ్వర రావు ఆత్మహత్యలు చేసుకుని అసువులు బాసినట్టు విశాఖజిల్లా దళిత, ప్రజాసంఘాల ఐక్యవేదిక సభ్యుడు కొత్తపల్లి వెంకటరమణ తెలిపారు. కులదుర హంకారి అయిన ఏపీఎస్ ఆర్టీసీ డిపోమేనేజర్ హెచ్.దివ్య కులపరమైన వేధింపులు, ఉద్యోగపరమైన బెదిరింపులు భరించలేక పురుగులమందు తాగి గత నవంబర్‌లో మరణించడన్నారు. అయితే ఆత్మహత్యగా పరిగణించలేమని, చనిపోయే స్థితిని కల్పించి, హింసించి చంపినట్టుగా సాక్షులు తెలియజేస్తున్నారని అన్నారు. డిపోమేనేజర్ దివ్య చేసిన హత్య కులహత్యగానే పరిగణించాలని పేర్కొన్నారు. ఈ మరణంపై స్థానిక పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం క్రింద కేసులు నమోదుచేసారని, నెలలు గడుస్తున్నా ఇంతవరకు అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. ఆర్టీసీ యాజమాన్యం ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డిపోమేనేజర్ దివ్యను ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, సెక్షన్ 306 ప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెను తక్షణమే విధుల్లోంచి తొలగించాలని, ఆర్టీసీ యాజమాన్యం, పోలీస్‌శాఖ, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఉత్తర నియోజక శాసనసభ్యులు, రాష్ట్ర బిజేపీ సభాపక్ష నేత పెనుమత్స విష్ణు కుమార్‌రాజును కలిసి వినతిపత్రం అందచేశారు. మృతుని కుటుంబానికి తగు న్యాయం చేయడానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ వినతిపత్రం అందచేసిన వారిలో ఏపీఎస్ఆర్టీసి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఎన్ ధర్మారావు, వై.రాంబాబు, బి.అప్పారావు తదితరులున్నారు.

23,24 న నిరుద్యోగులకు జాబ్‌మేళా

డిఆర్‌డిఏ పీడీ సత్యసాయిశ్రీనివాస్



విశాఖపట్నం,న్యూస్‌లీడర్:నిరుద్యోగులకు ఈనెల 23,24 తేదీలలో జిల్లాలో ప్రభుత్వఆదేశాలమేరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఏ పీడీ సత్యసాయిశ్రీనివాస్ తెలిపారు. శనివారం డిఆర్‌డిఏ కార్యాలయంలో మీడియా సమా వేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబరు ఒకటవ తేదీన నిరుద్యోగుల ఉపాధి కోసం ప్రభుత్వం యువనేస్తం కార్యక్రమం ఏర్పాటుచేసిందని దీనిద్వారా అర్హులైన వారికి ప్రతినెల వెయ్యి రూపాయిలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా 24 వేల మందికి ఈపథకం ద్వారా నగదు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మూడు నెలపాటు శిక్షణ ఇప్పించి అనంతరం ప్రభుత్వమే ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నా రు. జిల్లా వ్యాప్తంగా 27శిక్షణ కేంద్రాల ద్వారా ఈశిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 23తేదీన చోడవరం ఉపాధ్యాయ డిగ్రీ కళాశాల, 24తేదీన కంచరపాలెం గౌరీ డిగ్రీ కాలేజ్ యందు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువనేస్తం లబ్ధిదారులతో పాటు సాధారణ నిరుద్యోగులు కూడా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ అభ్యర్థులకు అవకాశముందన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణులైన నిరుద్యోగులు apssdc.ine వెబ్‌సైట్‌లో upcoming events లో జనవరి 23, 24 వైజాగ్ జాబ్‌మేళా లింక్‌ను దు తప్పనిసరిగా నమోదు చేసుకుని రిఫరెన్స్ నెంబరుతో పాటు మూడు రెజ్యూమ్‌లు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్సులు, ఒక పాస్‌పోర్టుసైజ్‌ఫోటోతో ఉదయం 9గం.కు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరు 18004252422, మొబైల్ నెంబర్లు 9133203064,8332058149 లలో సంప్రదించాలన్నారు. మీడియా సమావేశంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజరు సత్యసాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

22నుంచి పాట ముందు పద్యం - తెలుగు తల్లికి నైవేద్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శరత్ చంద్ర

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : జనవరి 22నుంచి 27వ తేదీ వరకు పాటకు ముందు పద్యం- తెలుగుతల్లికి నైవేద్యం పేరిట సంగీత కార్యక్రమం నిర్వహించనున్నట్టు శనివారం విజెఎఫ్‌లో జరిగిన సమావేశంలో శరత్ చంద్ర సాంస్కృతిక సామాజిక సేవా ట్రస్ట్ సమన్వయ కర్త కందర్ప రాధ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుభాషాభి వృద్ధికి చేస్తున్న కృషిలో భాగంగా ఈ కార్యక్రమం ఏడు ప్రధాన నగరాల్లో ఈ కార్యక్రమాన్ని స్వరసామ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర సారధ్యంలో నిర్వహిస్తున్నారన్నారు. దీని లో భాగంగా స్థానిక గాయనీ గాయకులకు ముందుగా తెలుగు పద్యాల్లో శిక్షణ ఇచ్చి, ప్రతి ఘంటసాల పాటముందు ఒక పద్యాన్ని చదివే వరవడి అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో శరత్‌చంద్ర సాంస్కృతిక సామాజిక సేవా ట్రస్ట్ వ్యవ స్థాపకుడు టి.శరత్‌చంద్ర, ట్రస్ట్ సెక్రెటరీ డివిరమ్య, విశాఖ కళాసంస్థల గౌరవాధ్యక్షుడు కొంతాల రాజు, శేషు తిరుమలరావు, ట్రెజరర్ గంటా ఈశ్వరరావు, సంస్థ సభ్యులు కె చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ-1 పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎన్ఏడి, న్యూస్‌లీడర్: కేంద్రీయ విద్యాలయం-1 పూర్వ విద్యార్థుల సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట కలిసి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కేంద్రీయ విద్యాలయం-1 104 ఏరియా కూడలిలో అలుమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్రీయ విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కామోడోర్ పీకే మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ముఖ్యమంత్రి ప్రిన్సిపాల్ కార్యదర్శి జి.సాయిప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రస్తుత విద్యార్థులకు పూర్వ విద్యార్థులకు మధ్య జరిగిన క్రీడలు ఉత్సాహభరితంగా జరిగాయి. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని నెంబర్‌వన్ పాఠశాలగా కేంద్రీయ విద్యాలయం వన్ నిలుస్తోందని విద్యాలయ మానేజ్మెంట్ కమిటీ చైర్మన్ కామోడోర్ పీకే మోహన్ తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యముగా విద్య బోధన చేస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగడం గర్వకారణమ న్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి ముఖ్యమంత్రి ప్రిన్సిపాల్ కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అంది చడంలో కేంద్రీయ విద్యాలయాల పాత్ర ఎంతో ఉందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకు వచ్చు విధముగా చేసిన ఈ పాఠశాలను జీవితములో మరువలేను అని అన్నారు. ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల సమావేశంలో స్నేహితులను కలవడం ఆనందదాయక మన్నారు. ఇప్పుడున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. 1977 నుండి ఇక్కడ చదివిన విద్యార్థులకు ప్రస్తుత విద్యార్థులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ రాయిసన్, కార్యదర్శి అనురాధ నామిని చైర్మెన్ సుబ్రహ్మణ్యం, ప్రత్యేక అధికారి సన్నిబాబు, బాల సతీష్ మురళి పట్నాయక్, జాయింట్ సెక్రటరీ బాజీ శ్యాం కుమార్ రెడ్డి, మహిళలు, పూర్వ విద్యార్థులు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత



బీమా పత్రం అందజేస్తున్న మన్నాల సొంబాబు

మధురవాడ,న్యూస్‌లీడర్: ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి చంద్రన్న భీమా అందజేత శనివారం జీవీఎంసీ 4వ వార్డు పరిధిలో ఉన్న మరికవలస గ్రామం లో గత కొన్నిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించిన ఒమ్మి అప్పారావు కుటుంబసభ్యులకు ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం గవర్న మెంట్ చంద్రన్న భీమా రూ.5లక్షలు వార్డు అధ్యక్షులు మన్నాల సొంబాబు గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది, తదుపరి కార్యక్రమం సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రెట్టింపు పింఛను కార్యక్రమం లో భాగంగా ఈ రోజు ఆయన ఫోటో కు పాలాభిషేకం మరియు కేక్ కటింగ్ చేయబడింది. ఈ కా ర్యక్రమంలో వార్డు కార్య దర్శి అర్జున్ జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ బోయి శ్రీను అర్జున్ జిల్లా మహిళా ఉపధ్యక్షు రాలు షేక్ జహనార 4వ వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ 4వ వార్డు మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి ఉపధ్యక్షులు కొండపు రాజు బీసీ సెల్ ఉపా ధ్యక్షులు సుందర నూకరాజు, భీమా మిత్ర భాగ్యలక్ష్మి, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టు పోలీస్‌స్టేషన్ సీఐగా జెర్రిపోతుల శ్రీనివాసరావు



ఎన్ఏడి, న్యూస్‌లీడర్: ఎయిర్పోర్ట్ పోలీస్‌స్టేషన్ సీఐగా జెర్రిపోతుల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్ చెందిన ఈ యన కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్హా ఆదేశాల మేరకు ఇటీవల విజార్ నుండి బదిలీ అయ్యి ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు అటా చ్మెంట్ సీఐగా బదిలీ అయ్యి వచ్చా రు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీస్ డ్రైవ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎసిపి లంక అర్జున్ మర్యాద పూర్వకంగా కలిశారు.

జనంలోకి జనసేన



గ్లాసు గుర్తును వివరిస్తున్న ఉషాకిరణ్

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : స్థానిక 32,33 వార్డుల్లో జనసేన కార్యకర్తలు నాయకులు జనబాట పట్టారు. ఈ సందర్భంగా జనసేన ఎన్నికల మేనిఫెస్టోను, పార్టీ గుర్తు అయిన గాజుగ్లాసును ప్రజలకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమాన్ని సంతోషిమాత ఆలయం రోడ్డులో నిర్వహించారు. అనంతరం జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధికారంలోకి వస్తే అట్టడుగువర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సంపూర్ణం అందుతాయని, కులాలకు మతాలకు అతీతంగా పారదర్శకం గా పాలన కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాజ సత్యనారాయణ, పోతు మహేష్, లావణ్య, గాయత్రి, ప్రమీల, వానపల్లి రంగారావు, గోపీ కళ్యాణం, మురళి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి కల్నల్ హోదా దక్కడం అభినందనీయం : గొల్లమాల



వీసీని అభినందిస్తున్న గొల్లమాల తదితరులు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి నాగేశ్వరరావుకు కల్నల్ హోదా దక్కడం గర్వకారణమని దళితసేన ఉపాధ్యక్షుడు గొల్ల మాల అప్పారావు అన్నారు. ఈ మేరకు దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు ఆధ్వర్యంలో విసి నాగేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ అవార్డు దక్కడం ఆంధ్ర విశ్వవిద్యాలయానికే కాకుండా విశాఖకే గొప్ప గర్వకా రణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ కార్యక్రమాల్లో దళిత సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నక్కెళ్ల నాగమణి , నగర అధ్య క్షుడు చింతాడ సూర్యం ,నగర ప్రధాన కార్యదర్శి పుచ్చా కామేశ్వరరావు నగర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు రాజాన సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రారంభోత్సవంలో పాల్గొన్న విష్ణుకుమార్ రాజు

ఎన్ఏడి,న్యూస్‌లీడర్: సంక్రాతి కానుకగా ఇళ్ల నిర్మాణం చేపట్టి స్థానిక వాసులకు అందచేస్తామని ఉత్తర నియోజ కవర్గం ఎంఎల్ ఏ విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈ మేర కు స్థానిక జీవీఎంసీ 34 వార్డ్ ఏ ఎస్ ఆర్ న గర్‌లో ఏపీ టిట్ కో ఆధ్వర్యములో నిర్మాణం చేప డు తున్న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమము చేప ట్టారు . రూ 24కోట్లు 64 లక్షలు వ్యయంతో ఈ ప్రాం తంలో 480 ఇల్లులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఈ సందర్భంగా పేర్కొ న్నారు .ఎన్నో ఏళ్ల నుండి ఈ ప్రాంతంలో ఉన్న స్థానికులు ఎన్నో కష్టా లు పడి అనారోగ్యం పాలయ్యారని పేర్కొన్నారు .6నుండి 9నెలల వ్యవధి క లంలో ఈ గృహ నిర్మాణాలను త్వరి తగతిన నిర్మాణం చేపడతామని ఆయన భరోసానిచ్చారు . అదే విధముగా ఈ ప్రాంతములో శిథిలావస్థ లో ఉన్న ఇళ్ల కు 10 వేలు చొప్పున ఇస్తామని భరోసా నిచ్చారు .ఈ కార్యక్రమములో ఏ పి టిట్ కో ఎస్ ఈ యూ ఉదయ కుమార్ ,ఈ ఈ నరసింహ మూర్తి ,డి ఈ సుధాకర్ ,ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బండారు శ్రీని వాసరావు , అర్ సి ఎం లు అజ్జ శ్రీనివాసరావు, మం గరాజు జోన్ 4 జోనల్ కమిషనర్ రమణ మూర్తి ఎఇ అప్పారావు,స్థానికులు మహిళ లు మరో సిబ్బంది పాల్గొన్నారు .

వుడా కాలనీలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : మాధవధార వుడా కాలనీ సెంట్రల్‌పార్క్‌వద్ద వైఎస్ఆర్‌సీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఈ వైద్యశిబిరంద్వారా అనేకమందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిర నిర్వహణలో 39వ వార్డు ప్రెసిడెంట్ పి. సునీత, సిటీ సెక్రెటరీ దమయంతి, రమేష్‌రెడ్డి, కె.చిట్టితల్లి, రెయ్యి వెంకటరమణ, ఇమ్మ్ పి అప్పారావు, పైడి శ్రీను, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల హౌసింగ్‌కు 12 ఎకరాలు

ఫెడరేషన్ డైరీ మంత్రి గంటా ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు


విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : జిల్లాలో ట్రిబులెబెడ్ రూం హౌసింగ్ కు సంబంధించి మధురవాడ కొమ్మాది ప్రాంతాల్లో సుమారు 12 ఎకరాల భూమిని కేటాయించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం మంత్రి గంటా తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ 2019 డైరీని పలువురు జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు .. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ట్రిబులెబెడ్ రూం హౌసింగ్ కు సంబంధించి సుమారు పదకొండు వందల మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నార న్నారు ,అందరికీ ఇల్లు నిర్మించి అందజేసే విధంగా తక్షణమే పనులు ప్రారంభించాలని జిల్లా అధికార యంత్రాంగం కి ఆదేశించామన్నారు. జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తక్షణమే ట్రిబులెబెడ్ రూం హౌసింగ్ నిర్మించి అందజేయాలని మంత్రి గంటాను కోరడం జరిగిందన్నారు.ఎన్నికల నాటికిజర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరామన్నారు... కార్యక్రమంలో అధ్యక్షులు పి నారాయణ.. ఈశ్వరరావు పాత్రుడు ప్రసాద్ శ్రీనివాస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎసీపీగా చిట్టిబాబు పదవీ బాధ్యతలు స్వీకరణ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖపట్నం సిటీ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. చిట్టిబాబు నుంచి మాత్రి మహేంద్ర పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు మహేంద్ర విజయవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్‌గా పదవీబాధ్యతలు నిర్వహించారు. బి. చిట్టిబాబు డిజిపి ఆఫ్ పోలీస్ , ఆంధ్రప్రదేశ్ డిజి ఆఫీస్ మంగళ గిరిలో రిపోర్టు చేయనున్నారు.

జిల్లా ఎస్పీ పాలరాజుకు డిఐజిగా పదోన్నతి



విజయనగరం,న్యూస్ లీడర్ : జిల్లా ఎస్పీ జి.పాలరాజుకు విశాఖపట్నం రేంజ్ డిఐజిగా పదోన్నతి లభించింది. ఈమేరకు శుక్రవారం రాయింత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2017 జూన్ 3న జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పాలరాజు జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. పోలీసులంటే కాఠిన్యమే కాదు కారుణ్యమూ ఉంటుందని చాటిచెప్పేలా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగానే వృద్ధమిత్ర కోఆర్డినేటర్లు, పాఠశాలల దత్తత వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో సఫలీకృ తులయ్యారు.


సత్యసాయి సాంస్కృతిక సమ్మేళనం



శ్రీసత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌జిచలం, శ్రీసత్యసాయి జాతీయ సేవా విభాగం సమన్వయకర్త ఎస్.కోటేశ్వరరావు, శ్రీసత్య సాయి బాలవికాస్ జాతీయ సమన్వయ కర్త శ్రీమతి శశికలా కోటేశ్వరరావు, శ్రీసత్యసాయి గుంటూరు జిల్లా అధ్యక్షులు కె నారాయణరావు, సమ న్వయ కర్తలు డాక్టర్ పి.ఎల్. నరసింహారావు, పుల్లెల పూర్ణచంద్, శ్రీనల్లిరెడ్డి, శ్రీసత్యసాయి ఏపీస్టేట్ ఇన్‌ఛార్జ్, వివిధ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, వివిధ పదాధికారులు పాల్గొనారు. ఈసందర్భంగా శ్రీసత్యసాయి క్రీడల సాంస్కృతిక సమ్మేళనం బ్రోచర్‌ను ఎస్‌జిచలం, ఇతర ప్రముఖులు ఆవిష్కరించారు.

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని శ్రీసత్యసాయి సంస్థలకు చెందిన 650 మంది విద్యార్థులు ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి విద్యావిహార్ స్కూల్, శ్రీసత్యసాయి స్పిరిట్యువల్ సిటీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏపీకు చెందిన 11, తెలంగాణకు చెంది 2 పాఠశాల విద్యా ర్థులు పాల్గొన్నున్నారు. సమైక్యత ద్వారా బలం, సమైక్యత ద్వారా స్వచ్ఛత, మనోధైర్యం క్రీడాస్ఫూర్తి, శారీరక మానసిక దృఢత్వం ఆధ్యాత్మిక భావం పెరుగుతా యనే ఉద్దేశ్యంతో ఏర్పాటుచేస్తున్నారు. ఈపోటీల్లో భాగంగా త్రోబాల్, వాలీ బాల్, ఇతర ఆటలు, నృత్యాలు, స్కిట్స్, గానం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించను న్నాయి. ఈ కార్యక్రమాల ప్రారంభోత్స వానికి శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, గుంటూరు ఐజీ, డిజి ఆఫ్‌పోలీస్ ఎలిగ వేణు గోపాలరావు ఇతర ప్రముఖులు హాజరు కానున్నారు. క్రీడల ముగింపు వేడుకల్లో శ్రీసత్య సాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షులు నిమిష్ పాండ్యా, ఏపీ రాష్ట్ర యువజన విభాగం, స్పోర్ట్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం, ఐపిఎస్, రాష్ట్ర మాజీ డైరెక్టర్ జనరల్‌ఆఫ్ పోలీస్, మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, శ్రీసత్యసాయి స్టేట్ ట్రస్ట్ కన్వీనర్ (రిటైర్డ్ ఐపిఎస్)హెచ్‌జె దొర,

21న శ్రీ రామలీల తీర్థ మహోత్సవం



ఎన్ఏడి, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ శ్రీ గౌరి సేవా సంఘం మర్రిపాలెం వారి ఆధ్వర్యంలో శ్రీరామలీల తీర్థ మహోత్సవం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు సదరము అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛరణలతో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, ఉత్తర నియోజకవర్గ విష్ణుకుమార్ రాజు, వాసుపల్లి గణేష్ కుమార్, కేంద్ర గౌర గవర సేవాసంఘం అధ్యక్షుడు ఆదారి అప్పారావు ముఖ్య అతిథులుగా రానున్నారని తెలిపారు. ఈ మహోత్సవంలో డాన్స్ బేబీ డాన్స్, రేలా రే రేలా, మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలంతా విచ్చేసి తీర్థ ప్రసాదం స్వీకరించి, కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

పంచాంగం

శ్రీ విళంబి నామ సంవత్సరం,
ఉత్తరాయనం,
హేమంత ఋతువు
పుష్య మాసం
శుక్ల పక్షం

చతుర్దశి మ.2-19 వరకు
ఆరుద్ర ప.8-07 వరకు
పునర్వసు (మర్నాడు సూ.ఉ.ముందు) తె.5-21 వరకు
వర్జ్యం సా.6-43 నుండి 8-09 వరకు
దు.ము: సా. 4-02 నుండి 5-02 వరకు
రా.కా: సా.4-07 నుండి 5-47 వరకు


‘కపట రాజకీయం’

‘కోడి కత్తి’ కేసు.. అంటూ, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మీద జరిగిన హత్యాయత్నాన్ని నీరుగార్చేందుకు తెలుగుదేశం పార్టీనే కాదు, ఆ పార్టీకి అనుకూలంగా పనిచేస్తోన్న మీడియా సైతం విశ్వ ప్రయత్నాలు చేసింది. అయితే, ‘పచ్చ రాజకీయం’ ఎక్కువ కాలం పై చేయి సాధించలేకపోయింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగ ప్రవేశంతో ఒక్కసారిగా ఈ ‘కేసు’ స్వరూపమే మారిపోయింది. హైకోర్టు సైతం, ఎన్ఐఏకి కేసు అప్పగించాలని సూచించడం, అంతకు ముందే కేంద్ర హోంశాఖ స్పందించడంతో విచారణ ఈ స్థాయికి వచ్చిందిగానీ, లేకపోతే.. వైఎస్ జగన్ మీద జరిగిన హత్యాయత్నం కేసు ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయేదే. ఇప్పటికీ చంద్రబాబు, ఈ కేసుని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తూనే వున్నారు. పదే పదే, ‘రాష్ట్రాల అధికారాల్లో కేంద్రం జోక్యం చేసుకోవడమేంటి.? ఎన్ఐఏకి ఈ కేసు విచారణ ఎలా అప్పగిస్తారు.? ఎన్ఐఏ విచారణకు మేం ఒప్పుకోం..’ అంటూ చంద్రబాబు సర్కార్ అహంకారం ప్రదర్శించడం హాస్యాస్పదం కాక మరేమిటి.? నిజానికి, జగన్‌పై హత్యాయత్నం జరిగింది విశాఖ విమానాశ్రయంలో.. అక్కడి భద్రత కేంద్రం చేతుల్లో వుంటుంది కాబట్టి, ఆ ఘటనతో తమకు సంబంధం లేదని చంద్రబాబు సర్కార్ గతంలోనే ప్రకటించుకుంది. అలాంటప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరిపితే చంద్రబాబుకి వచ్చిన సమస్య ఏమిటి.? ఏదో వుంది.. ఆ మతలబు ఏంటన్నది విచారణలో తేలుతుంది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి సంబంధించి ‘సిట్’ ఏర్పాటయ్యింది. ఇక్కడా చాలా పెద్ద విచిత్రమే చోటు చేసుకుంది. అదేంటంటే, తొలుత రాష్ట్ర డీజీపీ, వైఎస్ జగన్‌పై హత్యాయత్నాన్ని చాలా లైట్‌గా చూపేందుకు ప్రయత్నించారు. ‘అది పబ్లిసిటీ స్టంట్.. సంచలనం కోసం చేసిన దాడిగా భావిస్తున్నాం.. నిందితుడు వైఎస్ జగన్ అభిమాని’ అని ప్రకటించేశారాయన. సాక్షాత్తూ డీజీపీ, ఆ కేసుని అంత లైట్‌గా తీసుకుంటే, సిట్ ‘లోతుగా’ విచారణ జరుపుతుందని ఎలా అనుకోగలం.? కేసు ఇప్పుడు ఎన్ఐఏ పరిధిలోకి వెళ్ళింది గనుక, ఆ కేసు వివరాల్ని ఎన్ఐఏకి అందించాల్సిన బాధ్యత ‘సిట్’దే. కానీ, ‘సిట్’ అందుకు ససేమిరా అంటోందన్న వార్తలు వెలువడ్తున్నాయి. చేసేది లేక, ఎన్ఐఏ కోర్టును ఆశ్రయించింది. ఇంకోపక్క, ఎన్ఐఏ విచారణ పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ, చంద్రబాబు సర్కార్ కోర్టును ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే చట్టపరమైన సమస్యలుంటాయా.? అన్న భయం మాత్రం చంద్రబాబు సర్కార్‌ని వెంటాడుతోందనుకోండి.. అది వేరే విషయం. తెరవెనుక ‘కపట రాజకీయం’ లేకపోతే చంద్రబాబు భయపడాల్సిన పనిలేదు. కానీ, భయపడ్తున్నారంటే.. వైఎస్సార్సీపీ అనుమానాలే నిజమనే విషయం స్పష్టమవుతోంది.

బాబు ముందు అనేక సవాళ్లు

రాజకీయాలలో ఉన్న వారికి తర తమ భేదాలు ఉండరాదు, మమకారాలు, అభిమానాలు అంతకంటే ఉండకూడదు. వారికి లక్ష్యమే అన్నింటా కనిపించాలి. దాని కోసమే పోరాటం చేస్తూ పోవాలి. ఆశ, శ్వాస ఒక్కటిగా ముందుకు సాగితేనే రాజకీయాలలో విజయం వరిస్తుంది. చంద్రబాబు వైఖరి చూసినపుడు అలాంటి నాయకుడుగానే కనిపిస్తారు. ఆయన అనుకున్న దానికోసం ఎవరితోనైనా జట్టుకడతారు. అలాగే, ఎవరినైనా పక్కనపెట్టేస్తారు. ఇపుడు దేశంలో చూసుకుంటే చంద్రబాబు మాదిరిగా ఇంత వేగంగా రాజకీయ పరిణామాలకు స్పందించి పావులు కదిపే నాయకుడు వేరొకరు లేరని చెప్పవచ్చును. ఇక, చంద్రబాబు ఎన్నో యుద్ధాలలో ఆరితేరిన యోధునిగా ఉన్నారు. ఆయన ఎన్టీఆర్ అల్లుడిగా ఉంటూ టీడీపీలోకి ప్రవేశించిన తరువాత 1985, 1989, 1994 ఎన్నికలను ఎన్టీఆర్ వెనక ఉండి ఎదుర్కొంటే, 1999, 2004, 2009, 2014 ఎన్నికలను సొంతంగా పార్టీ అధినేత హోదాలో ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ పార్టీలో ఉంటున్నపుడు కూడా 1989లో ఒకమారు పరాజయం వెక్కిరించింది. ఇక, బాబు సొంతంగా పోటీ చేసినపుడు 2004, 2009 ఎన్నికలలో వరుసగా ఓటమిపాలు అయ్యారు. అయినా మొక్కవోని దీక్షతో పార్టీని బతికించుకుని 2014 ఎన్నికలలో అధికారంలోకి వచ్చారు. బాబు జీవితమంతా ఇలా ఎన్నికలు, వ్యూహాలు, పోరాటాలతోనే సరిపోయింది. ఇపుడు ఆయన వయసు డెబ్బయి ఏళ్లకు దరిదాపుల్లోకి వచ్చింది. 2019 ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగబోతున్నాయి. చంద్రబాబు రాజకీయ చాతుర్యానికి ఇపుడు కీలకమైన ఎన్నికలుగా వీటిని అంతా చూస్తున్నారు. బాబుతో సరిసమానంగా ఎత్తులు వేసే కేసీఆర్, మోడీ, అలాగే యువకెరటంగావిరుచుకుపడే జగన్ వంటి వారు ఇపుడు ఒకే మారు ఆయన మీదకు కత్తులు దూస్తున్నారు. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు చంద్రబాబు కచ్చితంగా అగ్ని పరీక్షకే సిద్ధపడుతున్నారనుకోవాలి.

వర్తమాన రాజకీయాలలో మంచి వ్యూహకర్తగా చంద్రబాబును చెప్పుకుంటారు. ఆయనను అపర చాణుక్యుడిగానూ కూడా అంతా పేర్కొంటారు. రాజకీయాలలో ఉన్న వారికి తర తమ భేదాలు ఉండరాదు, మమకారాలు, అభిమానాలు అంతకంటే ఉండకూడదు. వారికి లక్ష్యమే అన్నింటా కనిపించాలి. దాని కోసమే పోరాటం చేస్తూ పోవాలి. ఆశ, శ్వాస ఒక్కటిగా ముందుకు సాగితేనే రాజకీయాలలో విజయం వరిస్తుంది. చంద్రబాబు వైఖరి చూసినపుడు అలాంటి నాయకుడుగానే కనిపిస్తారు. ఆయన అనుకున్న దానికోసం ఎవరితోనైనా జట్టుకడతారు. అలాగే, ఎవరినైనా పక్కనపెట్టేస్తారు. ఇపుడు దేశంలో చూసుకుంటే చంద్రబాబు మాదిరిగా ఇంత వేగంగా రాజకీయ పరిణామాలకు స్పందించి పావులు కదిపే నాయకుడు వేరొకరు లేరని చెప్పవచ్చును. ఇక, చంద్రబాబు ఎన్నో యుద్ధాలలో ఆరితేరిన యోధునిగా ఉన్నారు. ఆయన ఎన్టీఆర్ అల్లుడిగా ఉంటూ టీడీపీలోకి ప్రవేశించిన తరువాత 1985, 1989, 1994 ఎన్నికలను ఎన్టీఆర్ వెనక ఉండి ఎదుర్కొంటే, 1999, 2004, 2009, 2014 ఎన్నికలను సొంతంగా పార్టీ అధినేత హోదాలో ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ పార్టీలో ఉంటున్నపుడు కూడా 1989లో ఒకమారు పరాజయం వెక్కిరించింది. ఇక, బాబు సొంతంగా పోటీ చేసినపుడు 2004, 2009 ఎన్నికలలో వరుసగా ఓటమిపాలు అయ్యారు. అయినా మొక్కవోని దీక్షతో పార్టీని బతికించుకుని 2014 ఎన్నికలలో అధికారంలోకి వచ్చారు. బాబు జీవితమంతా ఇలా ఎన్నికలు, వ్యూహాలు, పోరాటాలతోనే సరిపోయింది. ఇపుడు ఆయన వయసు డెబ్బయి ఏళ్లకు దరిదాపుల్లోకి వచ్చింది. 2019 ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగబోతున్నాయి. చంద్రబాబు రాజకీయ చాతుర్యానికి ఇపుడు కీలకమైన ఎన్నికలుగా వీటిని అంతా చూస్తున్నారు. బాబుతో సరిసమానంగా ఎత్తులు వేసే కేసీఆర్, మోడీ, అలాగే యువకెరటంగావిరుచుకుపడే జగన్ వంటి వారు ఇపుడు ఒకే మారు ఆయన మీదకు కత్తులు దూస్తున్నారు. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు చంద్రబాబు కచ్చితంగా అగ్ని పరీక్షకే సిద్ధపడుతున్నారనుకోవాలి. ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందున్న లక్ష్యం ఒక్కటే. అన్ని వర్గాలను ఎన్నికలకు ముందు ప్రసన్నం చేసుకోవడం. తమ ఓటు బ్యాంకుకు చిల్లుపడకుండా చూసుకోవడం. చంద్రబాబు వ్యూహరచనలు చేయడంలో దిట్ట. రాజకీయంగా తనకు ఉపయోగపడు తుందని భావిస్తేనే నిర్ణయాన్ని తీసుకుంటారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు ఆయన ఆలోచించే, అనుసరించే విధానాలు ప్రత్యేకంగా ఉంటాయి. తాను తీసుకోబోయే నిర్ణయాలను ముందు ప్రజల ముందు తన మీడియా ద్వారా బయటపెడతారు. దాని స్పందన చూసి, సర్వేల అనంతరమే డెసిషన్ తీసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. ఫిబ్రవరి చివరివారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్నాయి. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేరు. దీంతో ఈ నెలలోనే పూర్తిస్థాయి వరాలను ప్రకటించే ఉద్దేశ్యంలో చంద్రబాబు ఉన్నారు. ఒకవైపు అభ్యర్థుల కసరత్తును అర్ధరాత్రి వరకూ చేస్తూనే, మరోవైపు అధికారులతో కొత్త పథకాలపై సమీక్ష చేస్తున్నారు ఏపీ సీఎం. అందుకే దావోస్ పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. నిజానికి ప్రస్తుత పరిస్థితిని చూస్తే చంద్రబాబు పైన ఏపీ ప్రజల్లో అంతగా వ్యతిరేకత లేదు. స్థానిక ఎమ్మెల్యేల మీదనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చంద్రబాబుతోనే ఏపీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఇప్పటికీ ఏపీ ప్రజలు నమ్ముతున్నారు. అయితే ఎమ్మెల్యేల అవినీతి కారణంగా చంద్రబాబుపై ఉన్న నమ్మకం కూడా ఏమాత్రం పనిచేస్తుందన్నది సందేహమే. అందుకే ఇప్పటికే వివిధ వర్గాలను చంద్రబాబు ప్రసన్నం చేసుకోగలిగారు. నిరుద్యోగ భృతిని అమలు చేసి యువతకు దగ్గరయ్యారు. తాజాగా పింఛన్ల మొత్తాన్ని రెట్టింపు చేసి ఈ నెల నుంచే అమలు చేసి ఫింఛనుదారులకు చేరువయ్యారు. అయితే గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన రుణమాఫీ సక్రమంగా అమలు చేయలేదన్న అపవాదును చంద్రబాబు ఎదుర్కొంటున్నారు. రైతులు సర్కార్ పట్ల కొంత వ్యతిరేకతతో ఉన్నారని, విడతలు వారీగా రుణమాఫీ అమలు చేయడం వల్ల రైతులకు ఉపయోగం ఏమీ లేదని తేలడంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణలో అమలు పరిచిన రైతు బంధు పథకం తరహాలోనే కొత్త పథకాన్ని త్వరలోనే ఏపీ సీఎం ప్రకటించనున్నారు. తెలంగాణలో ఈ పథకం నుంచి కౌలు రైతులకు మినహాయింపు ఇచ్చారు. ఏపీలో మాత్రం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఈ పథకం పేరు, ఒక్కొక్క రైతుకు ఎంత ఇవ్వాలి? అన్న విషయాలనపై కసరత్తు దాదాపుగా పూర్తయింది. ఈ నెల 21వ తేదీన ఈ పథకాన్ని చంద్రబాబు ప్రకటించే అవకాశముంది. మొత్తం మీద చంద్రబాబు ఎన్నికల నాటికి అన్ని వర్గాలను దగ్గర చేసుకునే ప్రయత్నంలో పడ్డారు. మరి, ఇవన్నీ చంద్రబాబును ఎన్నికల గండం నుంచి గట్టెక్కించగలవా అన్నది ఇక్కడ ప్రశ్న. ముందే చెప్పుకున్నట్లుగా చంద్రబాబు ఓ పోరాటయోధుడు. ఆయన చివరి నిముషం వరకూ యుద్ధం చేస్తూనే ఉంటారు. ఆయనలో అలుపు ఉండదు. గెలుపు కోసం తపన తగ్గదు. పదునైన వ్యూహాలను ఎన్నో రచించడంతో దిట్టగా ఉన్న చంద్రబాబును అందుకే అంతా నమ్ముతారు. ఆయన ఓడిపోరని, తమను కూడా విజయతీరాలకు చేరుస్తారన్న నమ్మకం ఇప్పటికీ టీడీపీలోనే కాదు, బయట కూడా ఉంది. అదే ఆయనకు శ్రీరామరక్షగా ఉంటోంది.



రామ రామ !

పూర్వం ఒక నగరంలో ధనవంతులయిన అన్నదమ్ములు ఉండేవాళ్లు. కలిసే ఉండే వాళ్లు. అన్న గొప్ప ధర్మాత్ముడుగా పేరుపొందాడు. దానధర్మాలు చేస్తూ గుళ్లూ, గోపురాలు తిరుగుతూ గొప్ప భక్తుడిగా పేరు పొందాడు. అతని చుట్టూ ఎప్పుడూ సన్యాసులూ, సాధువులూ గుంపుగా ఉండేవాళ్లు. అతడిని పొగుడు తుండేవాళ్లు. అతనికి స్వర్గంలో స్థానం ఖాయం అని నమ్మకంగా చెప్పేవాళ్లు. అతను పురాణగాథలు వింటూ పరవశించేవాడు. రంతిదేవుడు, శిబిచక్రవర్తి,కర్ణుడు మొదలయిన వాళ్ల దాన గుణం వింటూ తానూ అంతటవాడనుకునేవాడు. అతనికి రామనామమంటే ఎంతో ప్రాణం. నిత్యం రామనామస్మరణలో లీనమయి ఉండేవాడు. కానీ అతని తమ్ముడు దీనికి పూర్తిగా వ్యతిరేకం. అతనికి భక్తిగిక్తీ ఉండేదికాదు. అతను ఆనందంగా,హాయిగా తిరుగుతూ ఉండేవాడు. విందులు,విలాసాలలో మునిగితేలుతూ వుండేవాడు. అన్నగారు ఏర్పాటుచేసే భక్తి సమావేశాలవైపు కన్నెత్తి కూడా చూసేవాడు కాడు. అన్నకు ఎప్పుడూ తమ్ముడు గురించి దిగులు, తన తమ్ముడు చెడిపోతున్నాడని, కానీ తమ్ముడు ఇవేవీ పట్టించుకోకుండా హాయిగా ఉండేవాడు. భగవన్నామస్మరణ లేకుండా జీవితానికి ఎలా ముక్తి వస్తుందని అన్న బాధ. జీవిస్తేచాలు, తక్కినవన్నీ అర్థం లేనివని తమ్ముడి ఉద్దేశం. అన్న డబ్బు సంపాదించడానికి జనాన్ని పీడించేవాడు. సన్యాసులు అతన్ని పీడించేవాళ్లు. దానం చెయ్యందే పుణ్యం రాదు. దానం చెయ్యాలంటే ధనం కావాలి. ధనం కావాలంటే జనాల్ని పీడించక తప్పదు. ఎందుకంటే ఎవర్నీ బాధ పెట్టకుండా డబ్బు సంపాదించలేం. కాబట్టి దానం చేసేవాళ్లు. తీసుకునేవాళ్లు ఒకే రకం. తమ్ముడు ఉల్లాసంగా సంపాదించడం, దానం చేయడం వీటికి దూరంగా గడిపేవాడు. అన్నకు తమ్ముడి గురించి దిగులు పట్టుకుంది. అతనికి దైవ భీతి ఉండేలా చెయ్యాలని కంకణం కట్టుకున్నాడు. అతనిచేత రామరామ స్మరణ చేయిస్తే తన జన్మ ధన్యమవుతుందని భావించాడు. అప్పుడు ఆ నగరానికి ఒక మహాత్ముడు వచ్చాడని, ఆయన గొప్ప శక్తి సామర్థ్యాలున్నవాడని విన్నాడు. వెంటనే వెళ్లి ఆ గురువుకు నమస్కరించి తన సమస్య చెప్పాడు. ఆ గురువు పూర్వాశ్రమంలో బలమైన వస్తాదు. వస్తాదుగా ఉండడం కన్నా సన్యాసిగా ఉండడం లాభసాటి వ్యాపారం అనిపించడం వల్ల సన్యాసిగా మారాడు. అన్న చెప్పినవన్నీ విని గురువు ”నీకెందుకు మీ తమ్ముడి నోటివెంట రామనామం చెప్పించాలి అంతే కదా?” అన్నాడు. అన్న ”స్వామీ! మీరాపని చేసి పుణ్యం కట్టుకోండి. మీకు జన్మాంతం రుణపడిఉంటాను” అన్నాడు. గురువు ఆ ధనవంతుని ఇంటికి అతిథిగా వచ్చాడు. ఎప్పట్లాగే సాధువులు చుట్టూ చేరారు. సత్కాలక్షేపంతో వారం రోజులు గడిచాయి. తమ్ముడు గమనించాడు. కానీ దూరం నుంచి చూస్తూ వెళుతూ ఉండేవాడు. ఒక రోజు గురువు తమ్ముణ్ని పిలిచాడు. తమ్ముడు వచ్చాడు. గురువు కూచోమని చెప్పి హితబోధ చేశాడు. తమ్ముడు పట్టించుకోలేదు. లేచి వెళ్లబోతే గురువు అతన్ని రెండు చేతుల్తో ఒడిసిపట్టి కిందకి తోసి పైనకూచుని ”మర్యాదగా రామరామ! అంటావా లేదా? ” అన్నాడు. ధైర్యం ఉన్న తమ్ముడు ”మీరు నా పీక నొక్కినా నేను రామరామ అనను” అన్నాడు. గురువు వదిలేశాడు. తమ్ముడు దుమ్ము దులుపుకుని లేచి వెళ్లిపోయాడు. గురువు అన్నవేపు తిరిగి ”చూశారా? ఒక్కసారి కాదు మీ తమ్ముడిచేత రెండు సార్లు రామరామ అనిపించాను” అన్నాడు. గురువు సామర్థ్యానికి సంతోషించిన అన్న గురువును సత్కరించాడు.

దిన ఫలాలు

ఆదివారం -20-1-2019

మేషం: చేపట్టిన పనులలో జాప్యం జరిగినా పూర్తిచేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆత్మీయులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారం.

వృషభం: ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అవసరాలకు డబ్బు అందుతుంది. దూరప్రాంతాల నుంచి విలువైన సమాచారం అందుతుంది. ఇంటాబయటా ప్రోత్సాహం లభిస్తుంది.

మిథునం : నూతన మిత్రులతో పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం:శ్రమ పెరుగుతుంది. పనులు నిదానంగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా సన్నిహితుల సహాయం అందుతుంది. ఆటంకాలు కొంతవరకు తీరుతాయి.

సింహం: సోదరుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. ముఖ్యమైన నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

కన్య: బంధువులతో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆశీస్సులు పొందండి.

తుల: నూతన ఉద్యోగాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది.

ధనుస్సు: లక్ష్మీతామరవత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధనచేయండి. దీర్ఘకాలిక ఋణాలు కొంతవరకు తీరుస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండండి.

మకరం: ముఖ్య నిర్ణయాలలో తొందరపాటు తగదు. జీవిత భాగస్వామి సలహాతో ముందుకు సాగుతారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

కుంభం: నూతన వ్యక్తుల పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ఆస్థి వివాదాలు తీరి లబ్ది పొందుతారు.

మీనం: ఇంటర్వ్యూలకు హాజరవుతారు. పనులలో విజయం సాధిస్తారు. విందువినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి.

పిల్లలకు సృజన పాఠాలు



పుస్తక పఠనం మనిషికి జ్ఞానాన్ని పెంచడమేకాకుండా, ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తోడ్పడుతుంది. చిన్ననాటి నుంచి పుస్తక పఠనాన్ని చిన్నారుల్లో పెంపొందించేందుకు డార్జిలింగ్‌కు చెందిన ఓ మహిళ ఎంతగానో కృషి చేస్తున్నది.

డార్జిలింగ్‌లోని నగరి టీ ఎస్టేట్‌కు చెందిన సృజన సుబ్బా అనే మహిళ తన గ్రామంలో సొంతంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నది. ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసేవాళ్లు. యూకేజీ చదువుతున్న సమయంలో ఆమె తల్లి ఓ డిక్షనరీని తీసి ఇచ్చింది. అలా చదువడం అలవాటైంది సృజనకి. ఆమె తల్లి కూడా పుస్తకాలు బాగా చదివేది. వాటిని సృజనకి పడుకొనే సమయంలో కథలుగా చెప్పేది. అలా ప్రతి రోజూ ఓ కథ చెప్పడం వల్ల సృజనకు పుస్తకాలు చదవాలనే ఆసక్తి మరింతగా పెరిగింది. ఆ తర్వాత కొన్నాళ్లకు పెద్ద ఎత్తున పుస్తకాలను సేకరించి తన ఇంట్లోనే ద బుక్ తీఫ్ పేరుతో కార్ పార్కింగ్ స్థలంలోనే ఓ గ్రంథాలయాన్ని ప్రారంభించింది. చిన్నారులకు ఆసక్తికరంగా ఉండే 500 కథల పుస్తకాలు, బొమ్మల పుస్తకాలను తన గ్రంథాలయంలో ఉంచింది. చదువుతో పాటు ఇతర పుస్తకాలను పఠించడం వల్ల కలిగే లాభాలను వారికి వివరిస్తూ పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెడుతున్నది. ఓ రోజు తన గ్రంథాలయానికి ఏడాదిన్నర వయసున్న పాపతో వాళ్ల అక్క వచ్చి పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆ పాప కూడా పుస్తకం వైపు ఆసక్తి కనబరచడం చూసి సృజన ఎంతో సంతోషించింది. అలాగే ఒక్కొక్కరూ పుస్తక పఠనం పై ఆసక్తి పెంచుకుంటూ ఉంటే భవిష్యత్‌లో సమాజం అంత త్వరగా ముందుకు వెళుతుందనేది సృజన అభిప్రాయం. భారతదేశంలోని ప్రతి గ్రామంలో ద బుక్ తీఫ్ లాంటి గ్రంథాల యాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సృజన కోరుతున్నది.

చరిత్రలో ఈరోజు -20

1265 : లండను లోని వెస్ట్‌మినిస్టర్ భవనంలో ఇంగ్లాండు పార్లమెంటు తొలిసారిగా సమావేశమైంది.

1900 : సంస్కృతాంధ్ర పండితుడు, ప్రముఖ తత్వవేత్త పరవస్తు వెంకట రంగాచార్యులు మరణం (జ.1822).

1907 : సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు బందా కనకలింగేశ్వరరావు జననం (మ.1968).

1940 : తెలుగు సినిమా కథానాయకుడు ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు జననం.

1957 : భారత దేశపు మొట్టమొదటి అణు రియాక్టర్, అప్సర ను ట్రాంబే లో ప్రారంభించారు.

1960 : తెలుగు సినిమా హాస్య నటుడు మరియు రాజకీయవేత్త విజయ నరేష్ జననం.

1964 : భారతీయ-అమెరికన్ పాత్రికేయుడు మరియు రచయిత ఫరీద్ జకారియ జననం.

1995 : తాజ్‌మహల్ చుట్టుపక్కల ఉన్న 84 కాలు ష్యకారక పరిశ్రమలను మూసేయాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు తెలుగు సినిమా కథానాయకుడు మరియు రాజకీయ నాయకుడు. ఇతడు జనవరి 20, 1940న జన్మించాడు. 1970, 1980లలో 183 తెలుగు సినిమాలలో నటించాడు. ఆ తరువాత రాజకీయాలలో ప్రవేశించాడు. భారతీయ జనతా పార్టీ తరపున 12 వ లోక్‌సభ ఎన్నికలలో కాకినాడ లోకసభ నియోజ కవర్గం నుంచి గెలుపొందినాడు. ఆ తరువాత 13 వ లోక్ సభకు కూడా నరసాపురం లోకసభ నియోజ కవర్గం నుంచి ఎన్నికై అటల్ బిహారీ వాజపేయి మంత్రివర్గంలో స్థానం సంపాదించాడు. మార్చి 2009లో భారతీయ జనతా పార్టీని వీడి ప్రజారాజ్యం పార్టీలో చేరినాడు. తరువాత జరిగిన ఎన్నికల్లో రాజ మండ్రి నుంచి లోక్ సభకు పోటీ చేసి ఓడిపో యాడు.ప్రముఖ నటుడు ప్రభాస్ కృష్ణంరాజు తమ్ముడు ఉప్పలపాటి సూర్యనారాయణరాజు కుమా రుడు.కృష్ణంరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని మొగ ల్తూరు తన కుటుంబ స్వగ్రామం. తెలుగునాట క్షత్రీయ రాజుల వంశ స్తూలు విజయ నగర సామ్రా జ్యము వారసులు కృష్ణంరాజు. కృష్ణంరాజుకు జీవిత బాగస్వామి శ్యామలా దేవి వీరికి ప్రసీదీ, ప్రకీర్తి, ప్రదీప్తి ముగ్గురు కుమార్తేలు.

మహాభారతం

దుర్యోధనుని శల్య ప్రార్థన

అనుకుంటున్నారు పాండవులు. విజయం చేజిక్కిందనుకుంటున్నారు. లేదని నువ్వు, ఈ కర్ణుడు వాళ్ళకు చెప్పాలి. అలా చెప్పేందుకే నీ సహాయం అర్థిస్తున్నాను. నువ్వు తప్పకుండా కర్ణునికి రథసారథి కావాలి” అన్నాడు మళ్ళీ దుర్యోధనుడు.

అతని చేతులు రెండూ పట్టుకున్నాడు. విదిలించుకున్నాడు శల్యుడు. నిప్పులు చెరుగుతున్నట్టుగా కర్ణ-దుర్యోధనుల్ని చూశాడు. ఆగ్రహావేశంతో ఇలా అన్నాడు.“దుర్యోధనా! ఏం మాట్లాడుతున్నావో తెలీకుండా పోతోంది నీకు! నన్ను కర్ణునికి, ఈ సూత పుత్రునికి సారథిగా ఉండమంటావా? రాజునై ఉండి ఈ శూద్రుడికి నేను పరిచర్యలు చెయ్యాలా? అయ్యయ్యో! నా కంటే కర్ణుడు పరాక్రమవంతుడు అనుకుంటున్నావు కాబోలు? కాదయ్యా కాదు! నా పరాక్రమశక్తిలో పదహారవ వంతుకి కూడా ఇతగాడు సరిపోడు”

ఊహించని మాటలవి. శల్యుడు ఆగ్రహంతో ఊగిపోతోంటే చేష్టలుడిగి చూడసాగారు కర్ణ-దుర్యోధనులు.“కృష్ణార్జునులనే తృణప్రాయంగా చూస్తున్న వాణ్ణి. అలాంటి నన్ను నువ్వు హీనంగా చూస్తున్నట్టుగా ఉంది. నీ సేనలో నేనుండడం నీకిష్టం లేదా చెప్పు! ఇప్పుడే వెళ్ళిపోతాను” అని చరచరా అక్కణ్ణుంచి ముందుకు కదిలాడు. సాటి రాజులు ఆపేందుకు ప్రయత్నించి, అతన్ని పట్టుకుంటే విదిలించుకున్నాడు. పరుగునపోయాడు దుర్యోధనుడు. శల్యుడికి ఎదురు నిలిచాడు.“ఆగు మద్రేశ్వరా! ఆగు! నా మాట విను! నిన్ను తక్కువ చేసి నేను మాట్లాడడం లేదు. అలాగే నీకన్నా కర్ణుడు గొప్పవాడని నేను అనడం లేదు. కాకపోతే అర్జునుని కంటే కర్ణుడు ఎంత గొప్పవాడో అలాగే కృష్ణుడి కంటే నువ్వు గొప్పవాడివి. అస్త్ర శక్తిలో అర్జునుని కంటే కర్ణుడెంత గొప్పవాడో అలాగే అశ్వ హృదయ విజ్ఞానంలో కృష్ణుని కంటే నువ్వు గొప్ప వాడివి. అందుకనే చెబుతున్నాను.



అర్జునునికి సరయిన జోడు కర్ణుడని ఎలా అంటున్నారో అలాగే కృష్ణునికి నువ్వు సరయిన జోడు. కృష్ణుని వల్లనే అర్జునుడు విజయాలందుకుంటున్నాడు. అలాగే నీ వల్ల కర్ణుడు విజయాలందుకోవాలని నా ఆశ.

కోరిక. అందుకే కర్ణుని రథసారథిగా ఉండమంటున్నాను. నువ్వు తప్ప మరొక దిక్కులేదు నాకు. నన్నర్థం చేసుకో” అన్నాడు దుర్యోధనుడు.

మళ్ళీ శల్యుని చేతులు పట్టుకున్నాడు. జాలిగా అతని ముఖంలోకి చూశాడు. అప్పుడు చల్లబడ్డాడు శల్యుడు.“దుర్యోధనా! కృష్ణుని కంటే గొప్పవాడినని అందరి ముందూ ఒప్పుకున్నావు. నాకది చాలు! నేను కర్ణుని రథ సారథిని అవుతున్నాను” అన్నాడు శల్యుడు.“కృతజ్ఞుణ్ణి” అన్నాడు దుర్యోధనుడు.“అయితే నాదొక షరతు” అన్నాడు శల్యుడు.“చెప్పు”“కర్ణునికి సారథిగా ఉంటూ నా ఇష్టం వచ్చినట్టుగా నేను మాట్లాడతాను. ఎందుకిలా మాట్లాడుతున్నావని కర్ణుడు నన్ను అడగరాదు. తప్పు పట్టరాదు. ఇందుకు మీరుభయులూ ఒప్పుకుంటే నాకెలాంటి అభ్యంతరం లేదు. నేను కర్ణుని సారథినవుతాను”

అన్నాడు శల్యుడు. ఆ మాటలకు ‘ఏమంటావు’ అన్నట్టుగా కర్ణుని చూశాడు దుర్యోధనుడు. ‘సరే’నన్నట్టుగా ఒప్పుకుంటున్నట్టుగా తలూపాడు కర్ణుడు.“నీ ఇష్ట ప్రకారమే జరగనీ” శల్యుణ్ణి దగ్గరగా తీసుకున్నాడు దుర్యోధనుడు. కర్ణుడు, శల్యుడు చేతులు కలుపుకున్నారు.

ఘనంగా శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవం

శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకున్న ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్యే పీలా, మాజీ మంత్రి దాడి తదితరులు


శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకున్న విశాఖ జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
పట్టణంలోని వేల్పులవీధి శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకున్నవారిలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖజిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ విల్లూరి పైడారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, పట్టణ


శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకొని అలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్సీ పప్పల, మాజీ మంత్రి దాడి

వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, జనసేనపార్టీ నాయకులు కొణతాల సీతారాం, పట్టణ సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. దర్శనానికి విచ్చేసిన ముఖ్య అతిథులను శ్రీగౌరీపరమేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు మద్దాల కూర్మారావు, జెట్టి శ్రీనివాసరావు, మద్దాల ఆర్వీ చలపతి నాగేశ్వరరావు, కొప్పోజి చిన్న (గోల్డ్ చిన్న), వాకాడ కృష్ణమోహన్, బొద్దపు ప్రసాద్, గొర్లి శేఖర్, దోమరౌతు రామారావు, నల్లల దేముళ్లు, వెదుళ్ల కనకారావు, వాకాడ బాబు తదితరులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఉత్సవ సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తు...


మాజీ మంత్రి దాడిని సత్కరిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ప్రతినిధులు

వేల్పులవీధి శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవం పురస్కరించుకొని అశ్లీల నృత్యాలు ప్రదరిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఇన్‌ఛార్జి సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్సవాన్ని పురస్కరించుకొని గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ముగ్గురు సీఐలు, పది మంది ఎస్ఐలతో పాటు మరో 250మంది పోలీసు సిబ్బందిని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియమించడం జరిగిందని ఆయన అన్నారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటయిన స్టేజ్‌ల వద్ద ఎటువంటి ఘర్షణలు పడినా కమిటీ ప్రతినిధులే బాధ్యత వహించవలసిన ఉంటుందని పట్టణ ఇన్‌ఛార్జి సీఐ కిరణ్‌కుమార్ అన్నారు.


వేల్పులవీధి శ్రీగౌరీపరమేశ్వరులను దర్శించుకున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీష్‌ను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు


ఎమ్మెల్యే పీలాను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీగౌరీపరమేశ్వరుల ఊంజల్‌సేవ


ఊంజల్‌సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
పట్టణంలోని శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం రాత్రి శ్రీగౌరీపరమేశ్వరుల 130వ ఊంజల్‌సేవ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మళ్ల సూర్యప్రకాశరావు, కామేశ్వరి దంపతులు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహించారు. దీనిలో ఈటీవీ పాడుతా తీయగా ఫేం పొలమరశెట్టి చంద్రరావు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయనను గౌరీ సేవా సంఘం పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కన్వీనర్ యల్లపు వెంకటరమణ, కోకన్వీనర్ బుద్ద రమణాజీ పాల్గొన్నారు.

వైభవంగా రాములవారి తీర్థం



మాడుగుల, న్యూస్‌లీడర్: మండలంలోని కేజేపురం గ్రామంలో శనివారం రాములవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేజేపురం నుంచే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెబల్స్ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో డ్యాన్సు బేబీ డ్యాన్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గత 12 సంవత్సరాలుగా రెబల్స్ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని యువకులు తెలిపారు.

చురుగ్గా గోకులం పశువుల షెడ్లు నిర్మాణం



మాడుగుల, న్యూస్‌లీడర్: రాష్ట్ర ప్రభుత్వం పశువులకు నీడను కల్పించాలనే ఆశయంతో గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలను ప్రారంభించింది. మాడుగుల నుంచి కేజేపురం వెళ్లే దబ్బగుంట మార్గంలో గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ విషయంపై శనివారం ఉదయం నీటి సంఘం అధ్యక్షులు మళ్ల వెంకట సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి 18వేల రూపాయలు కట్టడం జరిగిందని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా లక్షా 80వేల రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని, దీని కారణంగా పశువుల షెడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నామని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. పశువులకు నీడను కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కేజేపురానికి ఏడు గోకులం పశువుల షెడ్లకు నిధులు మంజూరు కాగా, భీశెట్టి శ్రీనివాసరావు, ఆడారి సూరిబాబుకు చెందిన గోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని రైతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మళ్ల జగ్గారావు, ఆడారి సన్యాసిరావు, పెంటకోట శ్రీను, యల్లపు రామునాయుడు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై ఏఎస్పీ విచారణ

రావికమతం, న్యూస్‌లీడర్: కొత్తకోట జంక్షన్‌లో ఈ నెల 16వ తేదీన ఎస్సీ వర్గానికి చెందిన యువకులపై అగ్రవర్ణానికి చెందిన యువకులు కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదుతో నర్సీపట్నం ఏఎస్పీ కె.ఆరీఫ్‌హఫీజ్ విచారణ చేపట్టారు. అలాగే సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివాదానికి గల కారణాలపై స్థానికుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆయనతో పాటు కొత్తకోట సిఐ లక్ష్మణమూర్తి, ఎస్సై శేఖరం ఉన్నారు.

పోటీల ద్వారానే ప్రతిభ

నాతవరం, న్యూస్‌లీడర్: పోటీలతోనే ప్రతిభ కనబర్చేందుకు అవకాశం ఉంటుందని అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ అన్నారు. మల్లుభూపాలపట్నంలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భగా విజయ్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఉద్యోగ అవకాశాలు సాధించగలరన్నారు. దీని కోసం నర్సీపట్నంలో భారీ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. కబడ్డీ ప్రథమ మల్లుభూపాలపట్నం, వాలీబాల్ విజేత నాతవరం, రంగవల్లి ప్రథమ రావాడ సత్య, ద్వితీయ కిల్లాడ రజిని, తృతీయ రావాడ హైమలకు బహుమతులుఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సన్యాసిదేముడు, ఎస్సై సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గన్నారు.

శ్మశానవాటికకు సిమెంట్ రోడ్డు నిర్మాణం

మాకవరపాలెం, న్యూస్‌లీడర్

మండల కేంద్రమైన మాకవరపాలెంలో శ్మశాన వాటికకు రూ.20లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. బృందావనం హోటల్‌ను ఆనుకొని శ్మశాన వాటికకు సుమారు 200 మీటర్లు పొడవున సిమెంట్ రోడ్డుతో పాటు ఇరుపక్కల సిమెంట్ కాలువను నిర్మిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు ఆనుకొని ఉన్న భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

27 నుంచి ప్రజాచైతన్య యాత్ర

కోటవురట్ల, న్యూస్‌లీడర్: ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి పాలనను ప్రజలకు వివరించేందుకు మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజాచైతన్య యాత్ర చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైసిపి సీనియర్ నాయకులు డివి.సూర్యనారాయణరాజు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ మరో నెల రోజుల్లో వెలువడనుందని, అందుకే మండలంలో ప్రజా చైతన్య యాత్ర చేపడుతు న్నామన్నారు. ఈ యాత్ర 27న ప్రారంభమౌతుందన్నారు. కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి ఆలయంలో 7 గంటలకు పూజలునిర్వహించి అన్నవరంలో 8 గంటలకు పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అక్కడి నుంచి యండపల్లి మీదుగా జల్లూరుకు సమీపంలో మధ్యాహ్నం బ్రేక్ అనంతరం రాత్రికి బికెపల్లికి చేరుకొని గ్రామంలో పర్యటించి అక్కడ బస చేస్తామని వివరించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలతో పాటు శివారు గ్రామాల్లో 8 రోజుల పాటు పాదయాత్ర ఉంటుందని చెప్పారు. సుంకపూర్‌లో పాదయాత్ర ముగుస్తుందన్నారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఎంవీవీ ప్రసాద్ నియామకంపై హర్షం

చింతపల్లి, న్యూస్‌లీడర్: టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడుగా ఎంవివి. ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియమించడంపై ఆ పార్టీ మండల అధ్యక్షులు బేరా సత్యనారాయణపడాల్ అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రసాద్ సేవలను గుర్తించి చంద్రబాబు కీలక బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. టీడీపీలో ప్రతీ కార్యకర్త, నాయకుకి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు.

పవన్ కెనాల్ గట్లను పరిశీలించిన ఎస్ఈ

సీలేరు, న్యూస్‌లీడర్: పవన్ కెనాల్ గట్లకు పడిన గండ్లను ఏపి జెన్‌కో ఎస్ఈ రామకోటిలింగేశ్వరరావు పరిశీలించారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఇక్కడకు వచ్చి గుంటవాడ జలాశయం నుంచి సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే కెనాల్‌ను పరిశీలించారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భారీగా కురిసిన వర్షాలకు ఇన్‌టెక్ డ్యాం సమీపంలోని కెనాల్ వద్ద చెట్టు కూలి గట్టు జారిపోయిన ప్రాంతాన్ని, పలు చోట్ల గట్లు దెబ్బతిన్న ప్రాంతాన్ని కెనాల్ వెంబడే నిర్మించిన రహదారిని పరిశీలించారు. స్థానిక ఈఈ వివెల్.రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడిఈ సింహాచలం, ఏఈ చలపతిరావు తదితరులు ఉన్నారు.

మామిడిపాలెం సంఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

రూరల్ సీఐ రామచంద్రరావు వెల్లడి


మాట్లాడుతున్న రూరల్ సీఐ రామచంద్రరావు

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్: మండలంలోని మామిడిపాలెంలో గురువారం రాత్రి జరిగిన సంఘటనపై బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి రూరల్ సీఐ రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు రాత్రి మామిడిపాలెం గ్రామంలో అశ్లీల నృత్యాలు వేసినట్లుగా గల సాక్షాధారాలన్నీ మా వద్ద ఉన్నాయన్నారు. ఆ రోజు రాత్రి 10 గంటల 15 నుంచి జరిగిన సంఘటనకు సంబంధించినది అంతా రికార్డు అయిన పుటేజీలు మా వద్ద ఉన్నాయన్నారు. అదేవిధంగా గ్రామంలో రికార్డి డ్యాన్స్ వేసుకొనేందుకు రూరల్ ఎస్ఐ ఆదినారాయణరెడ్డి అనుమతి ఇచ్చారని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఇటువంటి కార్యక్రమాలకు ఎస్ఐ ఇచ్చిన అనుమతులు పనిచేయవు. ఇటువంటి వాటికి కేవలం డీఎస్పీ మాత్రమే అనుమతులు ఇవ్వాలి. అయితే డీఎస్పీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అలాగే అనుమతి ఇచ్చేందుకు రూరల్ పోలీసులు డబ్బులు తీసుకున్నారని చెబుతున్నారు. దీనికి సంబంధించిన తగిన ఆధారాలు ఉంటే తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ రామచంద్రరావు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై ఫిర్యాదు

రోలుగుంట, న్యూస్‌లీడర్

గ్రామానికి చెందిన పలు గుజ్జల సురేష్‌ను ముగ్గురు వ్యక్తులు పాత కక్షతో దారి కాసి రెండు రోజుల క్రితం దాడి చేసి గాయపరిచారు. ఈ విషయాన్ని బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని విలేకరులకు చెప్పారు.

శారదానగర్‌లో జగన్ రావాలి- జగన్ కావాలి

నర్సీపట్నం, న్యూస్‌లీడర్

నర్సీపట్నం వైయస్సార్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శారదానగర్‌లో శనివారం రావాలి జగన్ కావాలి సీఎం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాశంకరగణేష్ ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్ఆర్ పార్టీ ఒక సారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. నవరత్నాలను వివరించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, నాయకులు కర్రి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న గణేష్

నిత్యలక్ష్మికి ఘన సన్మానం


అనకాపల్లి, న్యూస్‌లీడర్: మండలంలోని సంపతిపురంలో గ్రామంలో జరిగిన తీర్థం సందర్భంగా గ్రామవాసి అయిన బగ్గు అప్పారావు, పద్మావతిల కుమార్తె నిత్యలక్ష్మి ఎంబీబీఎస్ పూర్తి చేసి భారత ఆర్మీలో కెప్టెన్ హోదాలో డాక్టర్‌గా ఉద్యోగం నిర్వర్తిస్తున్నందున గ్రామ పెద్దలు వెలుగుల బాబూరావు, గ్రామ ప్రజలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెలుగుల బాబూరావు మాట్లాడుతూ భారత ఆర్మీలో నిత్యలక్ష్మి విధులు నిర్వహించడం ఊరికి గర్వకారణమన్నారు. నిత్యలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులను కోరారు. సన్మాన గ్రహీత డాక్టర్ నిత్యలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే భారత ఆర్మీలో వైద్యురాలిగా చేరడం జరిగిందన్నారు. భారత్ ఆర్మీలో సేవలు చేయడం ఎంతో గర్వంగా ఉందని, తన తండ్రి కూడా ఆర్మీలో సేవలు అందించారని, తాను కూడా దేశానికి సేవలందిస్తానని ఆమె తెలిపింది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు రాయి రామారావు, కల్లపల్లి అప్పారావు, దాసరి రాజారావు, దేశెట్టి గోపి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బోయిన భానుమూర్తి యాదవ్, గొర్లి రమేష్, వర్రా కృష్ణారావు, కోరుకొండ శ్రీను, సిరసపల్లి ఆదినారాయణ, కలపల్లి లోవరాజు, కోన చిన్న, ఈరుగుల శంకర్, గాదం సూరిబాబు, దేశెట్టి ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు మరువలేనివి


సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాడుగుల, న్యూస్‌లీడర్: అందరికితో కలిసి మెలసి ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన సిరిగిరిశెట్టి సూర్యనారాయణ మరణం బాధాకరమని మోదకొండమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు అన్నారు. శనివారం సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా కాకుండా పంచాయతీ వార్డు సభ్యులుగా, కాంట్రాక్టర్‌గా పలు రకాలుగా పనిచేసి మాడుగుల గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లవిల్లి సంజీవరావు, పెదబాబు, భీమరశెట్టి పైడియ్య నాయుడు, సయ్యపురెడ్డి సత్తిబాబు, కనిశెట్టి నగేష్, చింతా సోమకేశ్వరరావు, బొడ్డేటి ఆదినారాయణ, దండి సన్యాసయ్యదొర, భీమరశెట్టి గంగాధరరావు, సమ్మంగి జగన్, వీర్ని సురేష్, పల్లేల రాము పాల్గొన్నారు.

సూరిబాబు మృతికి సంతాపం



అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని భీమునిగుమ్మం చెందిన ఆది ఆంధ్రా సంఘ అధ్యక్షుడు గిలకల సూరిబాబు అకాల మృతి చెందారు. సూరిబాబుకి విశాఖజిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్, టీడీపీ నాయకులు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, కొణతాల వెంకట్రావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కోడి రామకృష్ణ, రాంబాబు, సబ్బవరపు గణేష్, కాయల ప్రసన్న, హేమ, ఆది ఆంధ్ర సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమునిగుమ్మం పోర్టు ఎంప్లాయిగా ఉంటూ తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశంపార్టీకి నిరంతరం పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఆది ఆంధ్రా సంఘానికి అధ్యక్షులుగా తమ సామాజిక వర్గానికి సేవలు అందిస్తూ శుక్రవారం రాత్రి అకాల మరణం వారి ఆత్మకు, శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు కోరారు.


రాష్ట్ర ప్రయోజనాలకన్నా రాజకీయాలే ముఖ్యమా?

నివేదికలపై చర్చ చెయ్యని రాజకీయపార్టీలు
85వేల కోట్లు రాష్ట్రానికివ్వాలి..!



విజయనగరం, న్యూస్‌లీడర్: విభజన చట్టంలోని అంశాలు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీలు, కేంద్ర రాష్ట్రంమధ్య జరుగుతున్న అంకెల గారడీ తదితర అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో వివరాలు అందించేందుకు లోక్‌సత్తాపార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ నివేదికను బయటపెట్టారని లోక్‌సత్తా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భీశెట్టి బాబ్జీ అన్నారు. దాదాపు పదిహేను రోజులు గడిచినప్పటికీ ప్రధాన పార్టీలు ఈ అంశాలపై చర్చించకపోవడం శోచనీయమన్నారు. శనివారం జిల్లాపార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పుస్తకం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం అధికారం కోసం పడరాని పాట్లు పడుతూ నిష్ణాతులైన నిపుణులతో తయారుచేసిన నివేదికలపై స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను వదిలివేసి స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయాన్ని ప్రజలు వివిధరంగాల ప్రతినిధులు గమనించాలని సూచించారు. జేసీ బృందం విడుదలచేసిన నివేదికలో కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి 85వేల కోట్లు ఇంకా ఇవ్వాల్సివుందని, రెవెన్యూ లోటు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికిసాయం, చట్టంలోని లోపాల ఆర్థిక నష్టం, ప్రత్యేకహోదాకు బదులుగా ప్రత్యేకసాయం, ప్రత్యామ్నాయ స్థలంలో నౌకాశ్రయ నిర్మాణం, జాతీయ విద్యాసంస్థలకు సొంతభవనాలు, అనుసంధాన మార్గాలు, మౌలిక సౌకర్యాలకు కేంద్ర నిధులు, రాజధాని ప్రాంత అభివృద్ధి, సౌకర్యాలు, పన్ను రాయితీలు తదితర అంశాలపై కమిటీ నివేదికలో పొందుపరిచిందన్నారు. జేసీ కన్వీనర్‌గా ఉన్న కమిటీలో జస్టిస్ పర్వతరావు, కె పద్మనాభయ్య, కాకి మాధవరావు, ప్రొ.ఆర్.రాధాకృష్ణ అజయ్‌కల్లం, ప్రొ. ఎస్ గలాబ్‌లతోపాటు తెలుగురాష్ట్రాలకు సంబంధం లేని నిపుణులు, కేంద్ర మాజీమంత్రి వైకె అలగ్, 13వ ఆర్థికసంఘం సభ్యులు డా. ఎం.గోవిందరాజులు, మద్రాసు స్కూల్ ఆఫ్ఎకనామిక్స్ డైరెక్టర్ ప్రొ. కెఆర్ షణ్ముగం వంటి మేధావులు నివేదిక పరిశీలించి సమ్మతించారన్నారు. రాష్ట్ర రెవెన్యూ లోటు కేంద్రం భర్తీ చెయ్యాలని నివేదికపై రాజకీయపార్టీల్లో, ప్రజల్లో చర్చజరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజారావు, నాగభూషణం, శిమ్మశ్రీను, చంద్రరావు, భాస్కర్, పిఎల్ఎన్ రాజు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు వెండి పళ్లెం బహుకరణ



బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్:
మండలంలోని వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఓభక్తుడు వెండిపళ్లెం, శఠగోపం వితరణగా అందించారు. రావికమతం గ్రామానికి చెందిన గురుభవానీ పోలరాతి అప్పారావు, నారాయణమ్మ దంపతులు శనివారం ఆలయానికి విచ్చేసి శ్రీవారికి పూజలు చేసి ప్రదానార్చకులు అంగర నరశింహాచార్యులుకి తాము తయారు చేయించిన వెండి పళ్లెం, శఠగోపాన్ని అందించారు. ఈ సందర్భంగా దాత అప్పారావు మాట్లాడుతూ కేజీ వెండితో రూ.40వేలు వెచ్చించి వీటిని శ్రీవారికోసం ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. ఈ సందర్భంగా దాతను స్థానిక వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

23న మహిళా ఎల్‌ఎల్‌ఆర్ మేళా

నర్సీపట్నం రూరల్, న్యూస్‌లీడర్

నర్సీపట్నంలో మహిళా ఎల్‌ఎల్‌ఆర్ మేళాను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామనినర్సీపట్నం ఎంవి ఇన్‌స్పెక్టర్ సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం స్త్రీలకు ఉద్దేశించి దీనిని చేపట్టడం జిల్లాలో ఇదే ప్రథమమన్నారు. ఈ నెల 23న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దీనిని నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 20 నుంచి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఆధార్‌తో పాటు నివాస, జనన ధృవపత్రాలు, ఒక కలరు ఫొటోతో ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలన్నారు. దీని రసీదును మేళా రోజున అందజేస్తే వారికి పరీక్షలు నిర్వహించి ఎల్‌ఎల్‌ఆర్ జారీ చేస్తామని తెలిపారు.

20న బారిష్టర్ పార్వతీశం నాటక ప్రదర్శన

డైమండ్ హిట్స్ ఛైర్మన్ దాడి రత్నాకర్ వెల్లడి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: డైమండ్ హిట్స్‌వారి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం బారిష్టర్ పార్వతీశం అను సాంఘిక నాటకం ప్రదర్శించనున్నట్లు సంస్థ ఛైర్మన్ దాడి రత్నాకర్ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లో శనివారం నాటక ప్రదర్శనకు సంబంధించిన ఆహ్వానపత్రికలను రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరపున ఈ ఏడాది 2019లో నాలుగు కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. మొదటగా 20వ తేదీ ఆదివారం సాయంత్రం 6-30 గంటలకు స్థానిక డాక్టర్ రావుగోపాలరావు కళా కేంద్రంలో ప్రయోగం థియేటర్ గ్రూప్ న్యూ ఢిల్లీ వారిచే బారిష్టర్ పార్వతీశం నాటకం ప్రదర్శించడం జరుగుతుందన్నారు. డిజిటల్ టెక్నాలజీతో ప్రయోగాత్మకంగా నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. రైటర్స్ అకాడమీ విశాఖపట్నం అధ్యక్షులు వీవీ రమణమూర్తి సౌజన్యంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొక్కపాటి నరసింహశాస్త్రి బారిష్టర్ పార్వతీశం నవలను రాజస్థాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తూము శివప్రసాఆద్ నాటకీకరణచేసి దర్శకత్వం వహిస్తున్నారన్నారు. గత ఏడాది మంగళంపల్లి బాలమురళీకృష్ణ చివరి సంగీత విభావరి ఇక్కడే నిర్వహించామని రత్నాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మళ్ల రాజా, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కోరుకొండ రాఘవ, గుండా శ్రీరామ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఆడారి రవి, వేగి దొరబాబు, అయితా సన్యాసిరావు పాల్గొన్నారు.


నాటక ప్రదర్శన ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న రత్నాకర్

సంచలన వార్తాపత్రిక
లీడర్ ఉత్తరాంధ్ర జోన్
విశాఖపట్నం
ఆదివారం 20-1-2019

యరకాశి చెరువు అభివృద్ధి విస్మరించారు

కోటబొమ్మాళి,న్యూస్‌లీడర్ : స్థానిక మేజరు పంచాయతీ పరిధిలో నున్న యరకాశి చెరువు అభివృద్ధిని విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోటబొమ్మాళి పంచాయతీ పరిధి ప్రజలందరికి స్నానాలకు, పిండ ప్రధానాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ చెరువు అభివృద్ధికి గత 15 ఎళ్ళుగా విస్మరించారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనికిరాని పనులకు ఎంతో ప్రాధాన్యత నిస్తున్న పాలకులు ఎంతో ప్రాముఖ్యతగల చెరువును పట్టించుకోక పోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. రెండేళ్ళ క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ పి. లక్ష్మీనర్సింహులు ఈ చెరువును పరిశీలించి దీని అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తానని, చెరువు గట్టు చుట్టూ మొక్కలు నాటి పార్కుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఘనంగా అల్లిపురం పరస మహోత్సవాలు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్థానిక అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామి పరస మహోత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయని సిటీ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ తోట వాసుదేవరావు అన్నారు. ఈ సందర్భంగా అయ్యవారిని దర్శించుకునే భక్తులకు అమ్మన్నా ఛారిటబుల్ వ్యవస్థాపకులు తోట వాసుదేవరావు ప్రసాదాలను పంపిణీ చేసారు. అయ్యవారి దయ వుంటే అందరు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజచీ విఫ్ ద్రోణం రాజు శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు, వీరరెడ్డిల సహకారంతో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్ని కల్లో రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిగా చేయాలని ప్రజలను కోరుతున్నానన్నారు.

బ్రహ్మ కుమారీల సేవలు శ్లాఘనీయం

సాలూరు,న్యూస్ లీడర్ శాంతి, ప్రశాంతత చేరూర్చేలా బ్రహ్మకుమారి సంస్త సేవ శ్లాఘనీయమని, అవసరమైనవని సాలూరు ఎమ్మెల్యే రాజన్నదొర అన్నారు. సాలూరు బ్రహ్మకుమారి సంస్తలో బ్రహ్మబాబా అవిభక్తదిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మానసిక పనుల ఒత్తిడితో అనారోగ్యవనికి గురయ్యేవారు కొందరైతే, మరకొంతమంది అశాంతికి గురై మానవత్వం విస్మరిస్తూ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇటు వంటివారిలో మార్పు తెచ్చేందుకు, మానవతా విలువలు, మానవజన్మ గొప్పతనం తెలియజేస్తూ ప్రశాంతతను చేకూర్చడంతో బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి మనోజి, పురపాలసంఘ మాజీఅధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా గోకులం నిర్మాణం

దత్తిరాజేరు,న్యూస్ లీడర్: దత్తిరాజేరు మండలంలోని పలు గ్రామాల్లో గోకులాల నిర్మాణం మందకొడిగా సాగుతుంది. మొదట విడతగా 65 పశువుల షెడ్లు మంజూరుకాగా ఇప్పటివరకూ రెండింటిని మాత్రమే అధికారులు ప్రారంభించారు. రెండో విడతగా ప్రతి గ్రామం నుంచి 20 వరకూ ధరఖాస్తులు ఉండగా మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంటుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఎన్నికల నియమావళి దగ్గరపడుతుందని, ఇప్పటికైనా మంజూరుచేస్తే వీలైనంత త్వరగా నిర్మించుకుంటామని రైతులు తెలుపుతున్నారు.

తల్లి సురక్ష పధకానికి శ్రీకారం

బొబ్బిలి,న్యూస్ లీడర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద వైద్యసేవల విలువల పరిధి రెట్టింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా ఈనెల 15వ తేదీనుంచి తల్లి సురక్షపధకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ప్రసవించే సమయాల్లో మాతృ మరణాలు తగ్గించేందుకు ఈపధకాన్ని తీసుకువచ్చారు. రాష్ట్రంలోని దీనికంద రెండు శస్త్ర చికిత్సలు నిర్వహించి బొబ్బిలి సామాజిక ఆసుపత్రి వైద్యులు దీని అమలుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని రంగరాయపురం గ్రామానికి చెందిన సాయికుమారి, గొల్లపల్లికి చెందిన స్వాతిలు ప్రసూతి కోసం ఆసుపత్రిలో చేరారు. ఎన్టీఆర్ వైద్యసేవలో భాగంగా వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించి సురక్షిత కాన్పుఅయ్యేలా చేసారు.

ఆన్‌లైన్‌లో అటవీహక్కుల భూములు

పార్వతీపురం, న్యూస్‌లీడర్ :టవీ భూముల్లో తరాలుగా సాగుచేస్తున్న వారికి ఆయా భూములపై హక్కులు కల్పించేందుకు వీలుగా అటవీహక్కుల చట్టం 2005 సంవత్సరంలో అమలులోకి తీసుకువచ్చారు. అప్పటినుంచి పోడు వ్యవసాయం చేస్తున్న వారిని గుర్తించి వారికిహక్కులను కల్పించే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవల ఎస్.కోట మండలంలో అటవీ భూములను తరాలుగా సాగుచేస్తున్న వారిని గుర్తించి పట్టాలిచ్చే ప్రక్రియను అధివకరులు ప్రారంభించారు. ఇప్పటివరకూ కాగిత రూపంలోఉన్న పట్టాలి వ్వడం మినహా భూమి రికార్డుల్లో అటవీ భూములకు సంబంధించిన అంశా లేవీ పొందుపరచలేదు. గిరిభూమి పోర్టల్‌కు అనుసంధానించే ప్రక్రియను ప్రారంభించడం ద్వారా ఈభూములకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లోనే లబ్దిదారులుపొందే వీలుంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడనానికి అటవీ భూములకు హ క్కులు పత్రం పొందిన వారు తమ పట్టా నకలు, ఫోటోలు, ఆధార్, రేషన్ కార్డులను ఐటిడిఎ కార్యాలయానికి సమర్పించాలని ఆర్ఓఎఫ్ఆర్ తాహసీల్దార్ తెలిపారు. వీటిని ఎంత త్వరగఅందిస్తే అంత త్వరగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు వీలు కలుగుతుందన్నారు.

గిరియువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

పాచిపెంట, న్యూస్‌లీడర్ : మండలంలో గిరిశిఖర గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన శైలిపై పోలీసులు ఆరా తీశారు. మండలంలోని కాట్ర గుడ్డి, గాజుల గుడ్డి, బంగారు గుడ్డి, బుచ్చెంపాడు, ఆడారు పాడు, ఇప్పల గుడ్డి, షేరుకు గుడ్డి, కుంటాం బడే వలస, ఊబి గుడ్డి, కుంటాం, మెట్ట గుడ్డి పలు గిరిజన గ్రామాలలో జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఎస్టీఎఫ్ పార్టీతో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగాంగా ఆయా గ్రామాలను సందర్శించినట్లు ఎస్ఐ ఏ. సన్యాసినాయుడు తెలిపారు. గిరియువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ పార్టీ సభ్యులు, స్థానిక పోలీసులు, గిరిజనులు పాల్గన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి : గంకల





విశాఖపట్నం,న్యూస్‌లీడర్:37వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్-3 తెలుగుదేశంపార్టీ కార్యాల యంలో తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు గంకల అప్పారావు అద్వర్యంలో దివంగతనేత స్వర్గీయ నందమూరి తారక రామారావు 23 వ వర్ధంతి కార్యక్రమం జరిగినది .ఈ కార్యక్రమం లో ముందుగా స్వర్గీయ అన్ననంద మురి తారక రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వాడి ఆత్మ గౌరవాన్ని ప్రపంచనలుమూలల చాటి చెప్పిన మహొన్నత వ్యక్తి ప్రతీ పేదవాడికి కూడు ,గూడు ,గుడ్డ ఉండాలని ద్యేయం తో పని చేసిన వ్యక్తి బడుగు బలహీన వర్గాల వారికీ రాజ్యాధికారాన్ని కట్ట బెట్టిన మహొన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమం లో జిల్లా తెలుఅదేసం పార్టీ కార్యదర్శి ఆవాల నారాయణ స్వామి ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,మహిళలు , యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు .

'గీత' మారుతుందా

'ప్రసాదం' ఇక రుచించదా ?

విజయనగరంలో టీడీపీకి చేటు కాలం







విజయనగరం,న్యూస్ లీడర్ : జిల్లా అంతటా తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఒకలా ఉంటే విజయనగరం నియోజకవర్గంలో మరోలా ఉంది. కీలకమైన విజయనగరం శాసనసభ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ వర్గపోరుతో సతమతమవుతోంది. ఈనియోజక వర్గంలో ఆ పార్టీ విజయం సాధించే అవకాశాలు మచ్చుకైనా లేవని చెప్పవచ్చు. రాష్ట్రమంతటా పార్టీ అభివృద్ధికి అధినేత అవిశ్రాంతంగా పోరాడుతుంటే జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. పార్టీలో నెంబర్ 2 గా గుర్తింపు పొంది తనకంటూ విశిష్ట రాజకీయాలను ఆపాదించుకున్న కేంద్రమాజీ మంత్రి, విజయనగరం లోక్‌సభ సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు విజయనగరం నియోజకవర్గంలో పరిస్థితిని గాలికొదిలేసారన్న విమర్శలు లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు చందంగా తయారైంది.

ఇదీ పరిస్థితి–

విజయనగరం శాసనసభ నియోజకవర్గం పరిధిలో పట్టణంలోని 40 వార్డులతో పాటు మండలం కూడా విస్తరించి ఉంది. విశేషమేంటంటే 40 వార్డుల్లో 32 వార్డులు, మండలం మొత్తం అంతా కూడా తెలుగుదేశం పార్టీ అత్యధిక భారీ విజయాన్ని సాధించింది. కానీ నాటినుంచి నేటి వరకూ ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు అనుసరిస్తున్న విధి విధానాలే ఆ పార్టీకి శాపంగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు.పట్టణం పరిధిలో పురపాలకసంఘం చైర్మన్, పాలకవర్గం పాలనలో చేతులెత్తేసింది.ప్రారంభం నుంచి పట్టణ ప్రజలకు అభివృద్ధి సంగతి దేముడెరుగు కనీస సౌకర్యాలను కల్పించలేకపోయారు. పాలకవర్గంలో సంపూర్ణ ఆధిక్యత సాధించినప్పటికీ చైర్మన్ తన నిస్సహాయ స్థితిని ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తూ వచ్చారు. పురపాలక సంఘ సమావేశాల్లో ఆయన బహిరంగంగానే ప్రతీసారీ తానేమీ చెయ్యలేకపోతున్నానంటూ చెప్పు కొచ్చారు. ఇది ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిపోయిం ది.మున్సిపల్ చైర్మన్ తన నీడను తానే నమ్మరని సాక్షాత్తు ఆ పార్టీకి చెందిన వారే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నా రు. ఈ అపనమ్మకంతోనే పట్టణం పరిధిలో ఏ పనులూ కూడా చేపట్టలేదు. నిధులు కూడా మురిగిపోయే పరిస్థితి వచ్చింది.స్వపక్షంలోనే విపక్షం ఏర్పడి కౌన్సిల్ సమావేశాల్లో పాలకవర్గంపై విమర్శల దాడి చేసారంటే పరిస్థితి తీవ్రతను అర్ధం చేసుకోవచ్చు.మరో వైపు సిట్టింగ్ ఎమ్మెల్యే మీసాలగీత పరిస్థితి అలాగే ఉంది. పేరుకి ఆమె ఎమ్మెల్యే ఆయినప్పటికీ ఏరోజు కూడా ప్రజా సమస్యలపై దృష్టి సారించలేదని ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం ఒక ఎత్తయితే ఆమె తమ సామా జికవర్గానికిచెందిన ఒక మంత్రితో కలసి పనిచేయడం చర్చనీయాంశంగా మారింది. మండలం పరిధిలో కూడా ఎక్కడా అభివృద్ధి లేకుండా పోయింది. ఏ గ్రామంవైపు చూసినా ప్రజలు కనీస సౌకర్యాలు కూడా నోచుకోని దృశ్యాలే కనిపిస్తాయి .ఒకవైపు మున్సిపల్‌చైర్మన్ మరోవైపు ఎమ్మెల్యే ఇరువురూ కూడా పోటీ పడి సాయశక్తులా నియోజకవర్గంలో పార్టీని నిర్వీర్యం చేసారని, ఆ పార్టీ కార్యకర్తలే కోడై కూస్తున్నారు.

చేతులు కాలాక...!

కాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే ఇద్దరూ కూడా గత కొద్ది రోజులుగా హడావిడి మొదలెట్టారు.నెల రోజులుగా రాజకీయ సందడి ప్రారంభమైంది. పూటకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వార్డుల్లో, గ్రామాల్లోకలియ తిరుగుతున్నారు. ఇది చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గంటకో సమావేశం నిర్వహించి ఫోటోలతో , పత్రికా ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. నిన్నమొన్నటి వరకూ ఏమీ పట్టించుకోకుండా ఇప్పుడొక్కసారిగా ప్రచార ఆర్భాటం చేస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యేల తీరును చూసి ప్రతీ ఒక్కరూ ఔరా ఇదేమి రాజకీయం అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇప్పటికిప్పుడు కోటి రూపాయల నిధులను పట్టణాభివృద్ధికి మంజూరు చేసేందుకు ఇదీ రాజకీయం..కాగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేలే ప్రధాన శాపాలని చెప్పక తప్పదు.దీనికి తోడు ఇరువురూ కూడా ఎవరికి వారు తమ వర్గాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రత్యేకంగా తన సామాజికవర్గానికి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణులన్నాయి. అవసరమైతేనే తప్ప ఆయన అశోక్‌బంగ్లా వైపు కన్నెత్తి కూడా చూడరు. దీనికితోడు ఏదైనా మీడియా సమావేశం ఉంటేనే తప్ప ఆయన బంగ్లాలోకి అడుగుపెట్టరు. అలాగే ఎమ్మెల్యే పరిస్థితి కూడా ఉంది. ఎమ్మెల్యే తన సామాజికవర్గానికిచెందిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో రాజకీయంగా సన్నిహితంగా ఉంటున్నారు. ఇది గమనించిన అశోక్‌బంగ్లా కోటరీ ఆమెను దూరంగా ఉంచింది. పనిచేయకపోవడంతో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్యనేతలు ఎప్పుడో దూరమయ్యారు.ఇదంతా ఒక ఎత్తయితే మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేలిరువురూ కూడా ఒకరికొకరు తీసిపోకుండా గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఎవరికివారు తమ సామాజికవర్గాలతో నచ్చినప్పుడు సమావేశాలు పెట్టుకుంటున్నారు. అంతే కాదు మున్సిపల్ చైర్మన్ నిర్వహించే సమావేశా నికి ఎమ్మెల్యే రారు, ఎమ్మెల్యే నిర్వహించే సమావేశానికి మున్సిపల్ చైర్మన్ కనిపించరు. మున్సిపల్, మండల పరిధిలో ఎవ్వరికి వారు సమావేశాలు నిర్వహించుకునే పబ్బం గడుపుకుంటు న్నారన్న విమర్శలు ఉన్నాయి.అటు పట్టణంలోను ,ఇటు మండలంలోను తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల విస్తరణ సమస్యలు ఉన్నాయి.ఎన్టీఆర్ ఇళ్ల కేటాయింపుల్లో కూడా అవినీతి గుప్పుమంది. ఈ సమస్యల విషయంలో ఇరువురు నేతలు కూడా ఎవరికి వారు తమ వర్గానికి లాభించేలా వ్యవహరించేలా ఆరోపణలు లేకపోలేదు.

పట్టు కోల్పోయారు.

విజయనగరం శాసనసభ నియోజకవర్గంపై తెలుగుదేశం పార్టీ నేతలు పట్టు కోల్పోయారు. ఈ విషయంలో మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేగీతలే ప్రధాన కారణమని చెప్పవచ్చు.పట్టణ పరిధిలోని 40 వార్డుల్లో ఏ ఒక్క వార్డులో కూడా ఇంతవరకూ తెలుగుదేశం పార్టీ సమావేశాలు జరగలేదు. వార్డుల వారీగా సమీక్షలు నిర్వహించలేదు. అశోక్‌గజపతిరాజు ఎప్పటిలాగే బంగ్లాకే పరిమితమయ్యారు. ఆయన యధావిధిగా కోటరీ చెప్పినట్లుగానే నడుచుకుంటున్నారు. ఏ ఒక్కరోజు కూడా ఆయన వార్డులవారీ నాయకులను పిలచి పార్టీ పరిస్థితిపై మాట్లాడిన దాఖలాలు లేవు. మండలంలోని గ్రామాల్లో ఉన్న పార్టీ నాయకులను పిలిచి సమీక్షించిన సందర్భాలు లేవు. ఇటీవల కాలంలో పట్టణంలోని 25వ వార్డు బిసికాలనీలో రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించేందుకు అశోక్‌గజపతిరాజు వెళ్లారు. అక్కడ తెలుగుదేశం పార్టీకి చెందిన రెండు వర్గాలు రెండు టెంట్లు వేసి రెండు కార్యక్రమాలను నిర్వహించారు.

రాజకీయ భవితవ్యం

కాగా ప్రస్తుతం నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ అనిశ్చితంగా తయారైంది. ప్రసాదుల రామకృష్ణకు మళ్లీ అవకాశం రానట్లే కనిపిస్తోంది.ఎందుకంటే ఆయన అటు ప్రజలకు ఇటు పార్టీ వర్గాలకు దూరమయ్యారు. అలాగే సిట్టింగ్ ఎమ్మెల్యే మీసాలగీతకు కూడా ఈసారి అవకాశం లేనట్లే. అశోక్ గజపతిరాజు కుమార్తె అధితి గజపతి ఈ సారి పార్టీ నుంచి ఎమ్మెల్యే బరిలో దిగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజికవర్గ రీత్యా మీసాలగీతకు అవకాశమివ్వాలనుకుంటే విజయనగరం చైర్‌పర్సన్ పదవిఉంటుంది. అదే జరిగితే ప్రసాదుల రామకృష్ణ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్ధక మే.నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి త్రిశంకుస్వర్గంలో ఉంది. ఇప్పటికిప్పుడు ఎంత హడావుడి చేసినా ప్రజలు ఏమీ తెలియని అమాయకులేమీ కాదు. వార్డుల్లో, గ్రామాల్లో వర్గపోరు పార్టీకి శాపంలా మారిందని చెప్పక తప్పదు. దీంతో రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్ ప్రశ్నార్ధకమే.

మీరుచేస్తే సంసారం మేముచేస్తే వ్యభిచారమా?

- కోడి కత్తి డ్రామాకాదు నారావారి కత్తి డ్రామా బయటపడుతోంది
- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్‌వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకి ఏపీ ముఖ్యమంత్రి దాసోహమైన రోజులు టీడీపీ వారు మరిచిపోయారా? టీడీపీ మంత్రులు నేతలు చెట్టాపట్టాలేసుకు తిరిగితే సంసారమా? వైసీపీ నేత జగన్మోహనరెడ్డి గౌరవప్రదంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుని కలిస్తే వ్యభిచారమన్నట్లు ప్రచారం చెయ్యడం దారుణమని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిది జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం మద్దిలపపాలెం వైసీపీ నగర కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యంచేసి,రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించి, పోలీస్ వ్యవస్తను నిర్వీర్యంచేసి, న్యాయవ్యవస్థను నిక్కరించి, ప్రజలపాలన గాలికొదిలేసి, అవినీతిని అందలం ఎక్కించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కనీసం జగన్మోహనరెడ్డి గురించి మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం, ప్రత్యేకహొదా, విభజనహామీల అమలు తదితర అంశాలసాదన కోసం బీజీపీ, కాంగ్రెస్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న టీఆర్ఎస్ నేతలతో మాట్లాడటం లో తప్పేముందన్నారు. వ్యక్తి గత ప్రయోజనాలకోసం తెలంగాణాలో వున్న వారి వ్యాపార ప్రయోజనాలకోసం కేసీఆర్ ఏపీ కి వచ్చినప్పుడల్లా టీడీపీ నేతలు పయ్యావుల కేశవ్, దేవినేని ఉమ వంటి వారితో సహా సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా అంటకాగిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఎన్ఐఏ కు జగన్‌మోహనరెడ్డి కేసును బదలాయించగానే మరుసటిరోజు విశాఖ సీపీ అత్యవసరంగా ప్రెస్‌మీట్ పెట్టి మరుసటిరోజు అకస్మాత్తుగా శెలవుపై వెళ్ళిపోవడం చూస్తుంటే ముఖ్యమంత్రి పోలీస్ వ్యవస్థను ఎలా నిర్వీర్యం చేస్తున్నారో అర్ధమవుతోందన్నారు. ఇప్పటివరకూ దర్జాగా విశాఖ వీదుల్లో తిరిగిన ఎయిర్‌పోర్టు క్యాంటీన్ అధినేత హర్షవర్ధన్ చౌదరీ ప్రస్తుతం కనబడటంలేదన్నారు. ఈవ్యక్తి నోరు విప్పితే నారావారి కత్తిడ్రామా బయటపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు, పార్లమెంట్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కంఠిరెడ్డి రామన్నపాత్రుడు, ఎస్సీసెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, లీగల్ అడ్వయిజర్ కాళిదాసురెడ్డి, యూత్ సెక్రటరీలు ఆదివిష్ణు, మన్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా నాయకులకు విన్నపం



వినతి పత్రాలు అందిస్తున్న యూనియన్ నాయకులు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 010 పద్దుద్వారా జీతాలు, క్యాష్‌లెస్‌హెల్త్ కార్డులు జారీచేయాలని కోరుతూ జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్‌నాయకులు రాష్ట్ర మానవ వనరులఅభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి విష్ణుకుమార్‌రాజు, విశాఖ పడమర ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు(గణబాబు), గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈవినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన మంత్రి గంటా శ్రీనివాసరావు మున్సిపల్ శాఖామంత్రి పి నారాయణతో ఫోన్‌లో సంభాషించి జనవరి 2019 నెలాఖరులోగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ వినతిపత్రం అందచేసిన వారిలో గుర్తింపు యూనియన్ నాయకులు కెబితిలక్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఆనందరావు, శాలివాహన, హరిగోపాల్, బంగారి కుమార్, వడ్డాది పరమేశ్వరరావు, బంగారి అప్పారావు, బొట్టా అప్పలరాజు, పిట్టాదేముడు, యర్రంశెట్టి శ్రీను తదితరులున్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రం



ఎన్టీర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : స్వర్గీయ ఎన్.టి.ఆర్. వర్ధంతి సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పౌరగ్రంథాలయాల సేవా సమితి కార్యకర్తలు వినతి పత్రం సమర్పించారు.మహారాణి పేటలోని జిల్లా గ్రంథా లయ సంస్థకు చెందిన ఎకరం స్థలం అన్యాక్రాంతమైనందుకు ఆవేదన చెందుతూ, ముఖ్యమంత్రికి, విద్యామంత్రికి సద్బుద్ధి ప్రసాదించి గ్రంథాలయానికి ఆ స్థలం తిరిగి స్వాధీనం చేయాలని వెంటనే ఆ స్థలంలో ఆధునిక గ్రంథాలయ భవనం నిర్మించాలని వారు స్వర్గీయ ఎన్టీఆర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి ఇ.ఎ. ఎస్. శర్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పు డు గ్రంథాల య విస్తర్ణకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారనీ, ఒకే ఒక జీవో నెం.269 (20-6- 1986) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో ఒకే రోజు 625 గ్రంథా లయాలు ప్రారంభించడానికి ఆయన చర్యలు తీసుకున్నారని, అంతటి మహనీ యుడు స్థాపించిన పార్టీ ఈ రోజు అధికారంలో ఉందనీ, కాని విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం సినిమా హాళ్ళు, బ్రాంది షాపుల మధ్య శోచనీ యమైన స్థితిలో ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమములో పౌరగ్రంథా లయాల సేవాసమితి కార్యదర్శి కె. త్రిమూర్తులు, కోశాధికారి పి. మల్లేశ్వరరావు, ఐద్వా నాయకులు పి. మణి,లో క్‌సత్తా నా యకులు ఎమ్ఎస్.ఎన్. మూర్తి, హరిగ ణేష్, పారుపల్లి కోదండ రామయ్య, సిపిఎం నా య కులు స్వతంత్ర కుమా ర్, వి.కృష్ణారావు, వి.వి. శ్రీ నివా సరావు, జి.వి.ఎ న్.చ లపతి, ఎం.సుబ్బా రావు, ఆర్.పి.రాజు, గ్రంథాలయ సంస్థ ఫించన్ దారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు కోసమే రోడ్డు నిర్మాణం



తన స్థలంలో నిర్మించిన రోడ్డును చూపుతున్న లచ్చుమయ్య

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : తన పై కక్షసాదించు కోసమే అవసరం లేకపోయిన తన స్థలంలో అడ్డగోలుగా రోడ్డు నిర్మించారని మండలంలోగల అక్కయ్యవలస గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి, ఎస్సీ కులానికి చెందిన తిమడాన లచ్చుమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్దానిక విలేకర్లుతో మాట్లాడుతూ అక్కయ్యవలస గ్రామంలో స్మశానానికి రహదారి నిర్మాణం పేరుతో అడ్డగోలుగా రోడ్డు నిర్మిస్తున్నారని, తన స్థలంకు సంబందంల లేకుండా ఇంకా తక్కువ ఖర్చుతో రోడ్డు నిర్మించుకొనేందుకు స్థలం ఉన్నప్పటికీ స్థానిక తెలుగుదేశం నాయకులు పార్టీ అండదండలు ఉన్నాయన్న దైర్యంతో తన పై కక్షసాదింపు చేస్తున్నారని లచ్చుమయ్య ఆరోపించారు.దేశం కోసం 30 ఏళ్ళు సేవలు అందించిన వారికే ఇలా చేస్తే ఇక సామాన్య మానవుడి పరిస్థితి ఏమిటన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యా యం చేయాలని లచ్చు మయ్య విజ్ఞప్తి చేశారు. లేకుం టే ప్రాణం ఉన్నం త వరకు ఈ స్థలంపై కోర్టుకు వెళ్ళి పోరా డు తానన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న దృశ్యం

రణస్థలం,న్యూస్‌లీడర్ : మండలంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాప కులు మాజీ ముఖ్యమంత్రి వ్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి కార్య క్రమం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం జాతీ య రహదారి పక్కన ఎన్‌టిఆర్ విగ్రహానికి ముందుగా పూలమా లలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొర్లె విజయ్‌కు మార్, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేష న్ డైరెక్టర్ నడుకుదిటి ఈశ్వరరావు మా ట్లాడుతూ తెలుగువాడి కీర్తిని నలుదిశలా చాటిచెప్పిన ఘనత ఆయన దేనని వారు కొనియాడా రు.అలాగే బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథ కాల ను అందించిన మహవ్యక్తని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వారితో పా టు రణస్థలం మండల మాజీ ఎంపీపీ డిజిఎం ఆనంద రావు, నాయకు లు రౌతు శ్రీనివాసరావు, ఎం కనకారావు, దుర్గాశి రామారావు, మాత అప్పా రా వు, ముక్కు ఆదినారాయణ, లంక అప్పలనాయుడు, దుమ్ము అశోక్, డి సత్తి బాబు,కె సూర్యనారాయణ, టి బాబురావు పూలమాల వేసి నివాళుర్పించారు.

ఏడు రోడ్ల జంక్షన్‌లో..



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 23వ వర్ధంతి సందర్భంగాశ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్‌లో గల ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి మంత్రి కింజరపు అచ్చన్నాయుడు, ఎంపీ రామోహన్‌నాయుడు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

72వ వార్డులో పేదలకు దుప్పట్ల పంపిణీ



పులిహోర ప్యాకెట్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: స్థానిక 72వ వార్డు సింహాచలం మార్కెట్ ఏరియాలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి వేడుకలు కర్రి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులంతా నివా ళులు అర్పించి ఎన్.టిఆర్ అమర్ హే అని నినాదం చేసారు. 72వ వార్డు పరిధిలో వున్నా నిరుపేదలకు 200మందికి దుప్పట్లు పంపిణి చేసారు. అలాగే 1000 మందికి పులిహోర స్వీట్స్ పంపిణి చేసారు. ఈ సందర్భంగా కర్రి అప్పల స్వామి (స్వామి) (అడవివరం కో ఆప్ సొసై టీ చైర్మన్) మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయ సాధనకై ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులూ గూసిడి శంకరరావు, తోమురోతు రాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షులు యెర్ర వరాహ నరసింహం, రాజనాల సత్యారావు గంటల కిరణ్ బాబు సతి వాడ శంకర్రావు, ముగ్గ కిరణ్, మజ్జి సూరి బాబు, కొరడా ఈశ్వరరావు, కొలుసు గురునాధ్, లోగిశ గణేష్, జన్మ భూమి కమిటీ సభ్యులు ఎన్ అప్పారావు, మేకల కాసు గోపాల్‌తో పటు మజ్జి కోటి, కొలుసు రామారావు తదితరులు పాల్గొన్నారు

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
ఆదివారం 20-1-2019


ఎలగెలగా..!!

తాను తీసిన కులం గోతిలో..



చంద్రబాబు సదా పాటించే స్ట్రాటజీలు రెండు వున్నాయి. ఒకటి, ఏ రాజకీయ నాయకుడికి విమర్శించాలి అంటే తమ పార్టీలో వున్న ఆ కులానికి చెందిన వారిని ముందుకునెట్టి, తిట్టించడం. రెండవది ఎక్కడ ఎన్నికలు జరిగినా, తమ దగ్గర వున్న కులాల ప్రతినిధులను అక్కడికి పంపడం. రెడ్డిని తిట్టాలంటే రెడ్డిని, కాపును తిట్టాలంటే కాపును ముందుకు తీసుకువచ్చి ప్రెస్ మీట్ పెట్టించడం, తిట్టించడం అన్నది చంద్రబాబు దశాబ్దాల కాలంగా చేస్తున్న పని. మొన్నటికి మొన్న నంద్యాల ఎన్నిక అంటే యనమల రామకృష్ణుడు సహా వివిధ ప్రతినిదులను కులాల ఓట్లు ప్రభావితం చేయడానికి అక్కడికి పంపించారు. ఇలా సదా కుల రాజకీయాలు చేయడం అన్నది చంద్రబాబుకు ఓటుతో పెట్టిన విద్య. అలాంటిది ఇప్పుడు తలసాని శ్రీనివాస యాదవ్ ఆంధ్రకు వచ్చి, కులసంఘ ప్రతినిధులతో మాట్లాడితే తెగ కంపరంగా వుంది. తెలంగాణ నుంచి వచ్చి ఇక్కడ రాజకీయాలు చేస్తారా? అంటూ విమర్శిస్తున్నారు. మరి మొన్నటికి మొన్న జరిగిన తెలంగాణ ఎన్నికల్లో హైదరాబాద్ లోని పలుచోట్ల తన వియ్యంకుడు, బావమరిది బాలకృష్ణ చేసిన పనేమిటి? ఎన్నికల ప్రచారం కాదా? ఆంధ్ర నుంచి వచ్చి ఇక్కడ రాజకీయం ఏమిటి? అని బాలయ్యను ఎవరూ క్వశ్చను చేయలేదు కదా? కూకట్ పల్లిలో గెలుపుకోసం ఆంధ్ర నుంచి వివిధ కులాల నాయకులను బాబు పంపిన వైనం జనాలకు ఇంకా గుర్తుంది.

ఎన్నాళ్లు కాపాడుతాం..?



ఎంతసేపు అని ఇలా రిసార్టుల్లోనూ... హోటళ్లలోనూ క్యాంపులు పెట్టుకుని ఎమ్మెల్యేలను కాపాడుకుంటారు? అనేదే పెద్ద ప్రశ్న. ఏదో బల నిరూపణ సమయంలో అయితే కొన్ని రోజుల పాటు కాపాడుకోవచ్చు. అయితే ఇలా రోజులకు రోజులు.. వారాలకు వారాలు.. క్యాంపులు నిర్వహించాలి, అసంతృప్త ఎమ్మెల్యేలను సంతృప్త పరచాలి అంటే.. ఎవరికీ సాధ్యంకాకపోవచ్చు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఎంతసేపని ఎమ్మెల్యేలను గుప్పిట్లో బంధించి ఉంచుకోగలదు? అనేది చర్చనీ యాంశంగా మారింది. ఇప్పటికే ఇండిపెండెంట్లు జారిపోయారు. తాజాగా సీఎల్పీ మీటింగుకు ఏకంగా నలుగురు ఎమ్మెల్యేలు దుమ్మాకొట్టారు. వారు తమకు చెప్పే ఆబ్సెంట్ అయ్యారని సిద్ధరామయ్య అంటున్నాడు. అయితే వారు నలుగురూ ఇప్పటికే తిరుగుబాటు మాటలు మాట్లాడినవారు కావడంతో.. కాంగ్రెస్ బలంలో నలుగురు ఎమ్మెల్యేలు తగ్గిపోయినట్టే అనే టాక్ వినిపిస్తోంది. ఇక తమ పార్టీ ఎమ్మెల్యేలకు బీజేపీ ఎరలు వేస్తోందని.. వాళ్లను కోట్ల రూపాయలతో కొనడానికి ప్రయత్నిస్తోందని కూడా సిద్ధరామయ్య అంటున్నాడు. అయితే.. ఈ విషయంలో కాంగ్రెస్ ఏమీ తక్కువ కాదనే వార్తలు వస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ కూడా బాగానే విదిలిస్తోందని.. ఎమ్మెల్యేలు కోరినవి ఇస్తోందని వార్తలు వస్తున్నాయి.

లోక్‌సభకి షర్మిళ ?



వైఎస్. షర్మిల. దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర రెడ్డి కుమార్తె. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన రెడ్డి సోదరి. రాజకీయాలకు దూరంగా ఉండే ఆమెను కొందరు టార్గెట్ చేసారు. సోషల్ మీడియాలో లేనిపోని పుకార్లతో ఆమెను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ప్రారంభమయిన ఈ వికృత చేష్టలు ఇటీవల మళ్ళీ ప్రారంభమయ్యాయి. దీంతో షర్మిల పోలీసులను సైతం ఆశ్రయించారు. షర్మిలపై 12 వెబ్ సైట్లు అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఇంత వరకూ ప్రత్యక్ష రాజకీయాలలోకి రాని వైఎస్. షర్మిల తప్పుడు పోస్టుల ఘటనతో రాజకీయ ప్రవేశం చేయాలని దాని ద్వారా ప్రత్యర్థులకు గుణపాఠం చెప్పాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో వచ్చే లోక్ సభ ఎన్నికలలో వైఎస్. షర్మిల - వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయమై వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన సోదారుడు వైఎస్ జగన్ తో కూడా చర్చించినట్లు సమాచారం.

ఉపసభాపతి ఎవరో..?

అయితే ఇప్పటివరకూ సభాపతి ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొనగా... ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ సీటుపై ఎవరు ఆశీనులు కానున్నారనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ స్పీకర్ గా రేఖా నాయక్ పేరు వినిపిస్తోంది. రేఖా నాయక్ పేరును సీఎం కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని రేఖా నాయక్ పేరును కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. టీఆర్ ఎస్ పార్టీ తరపున రెండోసారి ఖానాపూర్ నియోజకవర్గం నుంచి రేఖా ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవిని రేఖా నాయక్ కు కట్టబెట్టేందుకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఎస్టీ కోటాలో రేఖా నాయక్ కు డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

కృత్రిమ ఉల్కల సృష్టిలో జపాన్



టోక్యో: అమెరికా, చైనా వంటి దేశాలు అంగారక, చంద్ర గ్రహాల మీద పరిశోధనల కోసం అంతరిక్ష నౌకలను పంపడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న జపాన్ కృత్రిమ ఉల్కల సృష్టిపై దృష్టి పెట్టింది. ప్రపంచంలో మొట్టమొదటి కృతిమ (ఫేక్) ఉల్కాపాతాలను సృష్టించేందుకు అక్కడి ఏరో స్పేస్ ఎక్స్ ప్లోరేషన్ ఏజన్సీ ఓ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపింది. ఈ 'మ్యాన్ మేడ్ మీటియోర్ షవర్స్ 'సృష్టికి గల సాధ్యాసాధ్యాల పరిశీలనకుగాను 'ఎప్సి లాన్ రాకెట్-4' ను ఈ సంస్థ ప్రయోగించింది. అంతా సవ్యంగా జరిగితే అంతరిక్షంలో ఈ రాకెట్ మీడియం సైజు పెల్లెట్లను మండిస్తుందట. ఇలాంటి ప్రయోగాలు మరిన్ని జరిపేందుకు లక్షలాది పౌండ్లు వ్యయమవుతాయని అంచనా వేస్తున్నారు. సహజ సిద్ధమైన ఉల్కల కన్నా ఈ ఫేక్ మెటీయోర్స్ చాలా అద్భుతంగా ఉంటాయని, నింగిలో ఎక్కువసేపు కనబడుతాయని టోక్యోలోని ఏస్ట్రో లైవ్ ఎక్స్ పీరియెన్సెస్ సంస్థ పేర్కొంది. ఓ పెద్ద పెట్టె ఆకారంలో ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ ని తమ ఏజెన్సీకి అనుబంధంగా ఉన్న కక్ష్యలోకి పంపినట్టు ఈ సంస్థ సీఈఓ లీనా ఒకజిమా తెలిపారు.

పారదర్శకత అన్నింటిలో ఉండాలి

రాష్ట్రపతికి రాసిన లేఖలో మాడభూషి

(ప్రత్యేక ప్రతినిధి)



ప్రజలు దేశంలో జరుగుతున్న అన్ని విషయాల సమాచారం తెలుసుకునే హక్కుని చట్టంగా కల్పించినందుకు ధన్యవాదాలు. కానీ ఆచరణలో ఆ చట్టం అంత సమర్థవంతంగా అమలు కావడం లేదు. గత అక్టోబర్‌నెలలో జరిగిన కేంద్ర సమాచార కమిషనరేట్‌లో భారత రాష్ట్రపతిగా మీరు అందించిన అమూల్య సందేశం ఎంతో విలువైనది. కానీ నిజమైన పారదర్శకత అనేది ముందుగా ఈ కేంద్ర సమాచార కమిషనరేట్ నుంచే ఆరంభం కావాలని మాజీ సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మాడభూషి శ్రీధర్ భారత రాష్ట్రపతికి ఓ లేఖలో కోరారు. ముఖ్యంగా ఎంతో ముఖ్యమైన రంగాల్లో కావలసిన సమాచారం ప్రజలకి స్వేచ్ఛగా ఉచితంగా లభించడం లేదన్నారు. ముందుగా ఈ సీఐసిలో నియమకాలంలోనే పారదర్శకత లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సహ చట్టంలో సెక్షన్4లో నిబంధనల సహ డైరెక్టర్ల నియామకంలో పారదర్శకత పాటించమని భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినప్పటికీ వారి నియామకాల్లో సమతుల్యన్యాం పాటించలేదని మాడభూషి ఆలేఖలో పేర్కొన్నారు. మొన్నటికి మొన్న సిబిఐ డైరెక్టర్ అలోక్‌ని తప్పించడానికి ముగ్గురిలో ఇద్దరి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకున్నారని, అది చట్టబద్ధమైనప్పటికీ అలోక్ చేసిన తప్పులను ప్రజలకి సహచట్టం కింద లిఖితపూర్వకంగా ఎవరు అందచేయడం లేదని ఆయన పేర్కొన్నారు. భారత దేశ ప్రథమ పౌరుడిగా సహచట్టం సరిగ్గా దేశంలో అమలు అయ్యేటట్లు చర్యలు తీసుకోమని శ్రీధర్ రాష్ట్రపతిని కోరారు.

అయ్యో పాపం.. ఆడది

బార్ డ్యాన్సర్ల కథ వ్యథాభరితం



కొడుకుల శ్రీనివాస్

ఈ ప్రపంచంలో ఏ వ్యక్తీ తమకు తానుగా చెడిపోవడానికి ఇష్టపడదు. కాలం అవసరం అలా మారుస్తుంది. అలాగే ఏ స్త్రీ తమకు తానుగా నలుగిరి ముందు నగ్నంగా నర్తించాలని అనుకోదు..అమ్మతనాన్ని అమ్ముకోవాలనీ అనుకోదు..ప్రతిభారత సతి మానం ఆ చంద్రమతి మాంగల్యమే..జానెడు పొట్టని నింపుకోవడానికి పొట్టపైన ..బొడ్డు కింద ఆచ్ఛాదన లేకుండా ఆకలి కోసం అలా అందరిముందు అంగడిబొమ్మలా అంగాంగ ప్రదర్శన చేస్తోంది. ముంబై బార్ డాన్సర్ల కేసులో సుప్రీం తీర్పు కాస్త ఇంట్రస్టింగు... చదివి కాస్త ఆలోచించాల్సిన సబ్జెక్టు కూడా..! సుప్రీం తీర్పులో ముఖ్యాంశాలు ఏమిటంటే..? బార్ డాన్సర్ల వృత్తిని ప్రభుత్వం నిషేధించకూడదు. బార్ డాన్సులకు అనుమతించాలి. ఎవరూ డాన్సర్లపై డబ్బులు విసరకూడదు... నిర్ణీత వేళల్లోనే డాన్సులు ఉండాలి. నిజానికి ఈ బార్ డాన్సర్ల న్యాయపోరాటం ఈనాటిది. కాదు.. 2005లో అప్పటి కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం మొదట ఆ డాన్సు బార్లను మూసేసింది. దీనిపై న్యాయపోరాటం సుప్రీం దాకా పోయింది అప్పుడే... 2013లో సుప్రీం వీటిని తెరవటానికి అంగీకరించింది. వెంటనే 2014లో మళ్లీ ప్రభుత్వం నిషేధించింది. మళ్లీ సుప్రీం స్టే ఇచ్చింది. 2015లో... ఇక ఇలా కాదని ఫడ్నవీస్ ప్రభుత్వం 2016లో ఏకంగా ఓ చట్టం తీసుకొచ్చింది... డాన్స్ బార్ రెగ్యులేషన్ యాక్ట్.. అందులోని అంశాలను ఇప్పుడు సుప్రీం కొట్టేసింది. నిజంగా బార్ డాన్సర్లు ఇది రిలీఫేనా..? సుప్రీం తీర్పు స్వాగతించతగినదేనా..? అయితే ఏ కోణంలో..? ఇదీ చర్చ.. ఈ స్థితిలో సుప్రీం తాజా తీర్పును ఆక్షేపించేవాళ్లున్నారు, సమర్థిస్తున్న వాళ్లూ ఉన్నారు. ఇలాంటి దుర్వ్యసనాల్ని సుప్రీం ప్రోత్స హిస్తున్నదా..? సమాజం నైతికస్థాయి పెంచే దిశలో ఆలోచించాలే తప్ప వీటిని సుప్రీం సమర్థించడం ఏమిటి..? అనేది సంప్రదాయవాదుల బాధ... దానికి విరుద్ధమైన వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. వాళ్ల మంటారంటే..? 1) ప్రభుత్వం బార్ డాన్సర్లు, వెయిటర్ల పొట్టలుకొట్టింది... అనివార్యంగా డాన్సర్లను పడుపు వృత్తి వైపు నెట్టేసింది... 2) ముంబైలో పడుపు వృత్తి సబబే గానీ, ఈ డాన్సర్ల వల్లే సమాజపు నైతికత పతనం అయిపోతున్నదా..? పేకాట క్లబ్బులు, గ్యాంబ్లింగు, రెడ్ లైట్ ఏరియాలు, బార్లు... మరి ఇవన్నీ ఏమిటి..? 3) అసలు ప్రభుత్వాలు పోలీసింగు చేయాలి తప్ప మోరల్ పోలీసింగు చేయడం ఏమిటి..? ఫలానా తిండే తినాలి. ఫలానా బట్టలే కట్టాలి. ఫలానా వృత్తే చేయాలి అనే ఆంక్షలు ఏమిటి.? 4) మద్యపానం, పడుపు వృత్తి, పేకాట వంటివి ప్రభుత్వాలు నిరుత్సాహపరచాలే తప్ప నిషేధించొద్దు... ప్రభుత్వాల పని కాదు అది.. సరే, ఈ వాదనలు ఎలా ఉన్నా.. ప్రభుత్వాల నిషేధాల తరువాత ఏం జరిగింది..? సేమ్, మన రాష్ట్రాలలో మద్యనిషేధం అమలు తీరులాగే... మాఫియా, సిండికేట్లు. చీకటి దందాలు స్టార్టయ్యాయి. అనధికారికంగా, రహస్యంగా ఈ బార్లు నడిపించడం స్టార్టయింది. నాయకులకు, అధికార్లకు అందరికీ తెలుసు... అందరికీ వాటాలు.. చూసీచూడనట్టు ఉండటానికి... కొందరికి నేరుగా ఆ దందాల్లో వాటాలు కూడా.. సినిమా మాయలో పడి ముంబైకి తరలివచ్చేవాళ్లు, ఉళ్లల్లో ఉపాధి దొరక్క పనులు వెతుక్కుంటూ వచ్చేవాళ్లు కొత్తగా ఈ డాన్సింగు వృత్తిలోకి వస్తున్నారు.. కానీ ఇదంతా అనధికారికం, అక్రమం కాబట్టి మాఫియా లీడర్లు వాళ్లను దోపిడీ చేస్తున్నారు.

ఆర్థిక దోపిడీ. లైంగిక దోపిడీ...

ఇక్కడే మరో అంశం.. ఈ డాన్సింగ్ స్టేజీల వద్ద సీసీటీవీ కెమెరాలు పెట్టకూడదు, వాళ్లపై డబ్బులు విసిరేయకూడదు అనీ సుప్రీం చెప్పింది... ఇంట్రస్టింగు... కానీ ఎందుకు..? ఆ వృత్తి డిగ్నిటీ ముఖ్యం, వాళ్లేమీ సెక్స్ ఆబ్జెక్టులు కాదు, అందుకే అలా డబ్బులు విసరకూడదు, కానీ టిప్స్ ఇస్తే వోకే అనేది సుప్రీం తీర్పుకి ఓ బాష్యం. అయితే సీసీటీవీలు పెట్టకూడదు అనేది ఆ డాన్సులకు వచ్చి ఎంజాయ్ చేసే మగమహారాజులకు రక్షణే తప్ప ఆ డాన్సర్లకు దాంతో వచ్చేదేమీ లేదు. పోయేదేమీ లేదు. వాళ్లు ఎలాగూ సెక్స్ ఆబ్జెక్ట్ గానే చూడబడుతున్నారు కాబట్టి టిప్స్ ఇచ్చినా అంతే. తెగతాగిన ఓ కస్టమర్ ఆనందంగా డాన్సర్ల వైపు నోట్లను వెదజల్లినా ఒకటే... పెద్ద ఫరక్ పడదు... 'ప్రదర్శనలో తేడా తప్ప ఉద్దేశం ప్లస్ రిజల్ట్ సేమ్.. ఈ బార్ల ఓనర్లకు మంచి చరిత్ర ఉండాలనీ, నేరచరితులకు పర్మిషన్స్ ఇవ్వవద్దనీ సుప్రీం చెప్పింది. నిజానికి మంచి నడత అంటే నిర్వచనం ఏమిటి..? ఎలాంటి కేసులు గనుక లేకపోతే సచ్చీలుడేనా..? ఒకరి పేరుతో పర్మిషన్ తీసుకుని ఇంకెవరో నడిపించడం అనేది మన దేశంలో చాలా వ్యాపారాల్లో కామన్..
సరే, ఇక్కడ ఆలోచించాల్సింది ఏమిటంటే..? సుప్రీం తీర్పు ఉద్దేశాలను బట్టే ఆలోచిస్తే... ప్రభుత్వాలు మోరల్ పోలీసింగు చేయనక్కర్లేదు. ప్రభుత్వాలు ఆదాయమార్గాలూ పట్టించుకోవాలి, వేల మంది బతికే రంగాలు, వృత్తులను ఇగ్నోర్ చేయలేం, తిండి, బట్ట, భాష, వినోదం విషయాల్లో ప్రభుత్వాలు ఆంక్షలు, పరిమితులు పెట్టకూడదు. ఇవన్నీ సబబే అనుకుందాం... కేవలం బార్ డాన్సర్ల వల్ల సమాజానికి జరిగే నైతికనష్టం ఏమీలేదు, దాన్ని వదిలేస్తే... మరి డ్రగ్స్, పేకాట క్లబ్బులు, వ్యభిచారం, మద్యం దగ్గర్నుంచి జాతరల్లో కేబరే డాన్సుల దాకా... అన్నీ వోకేనా..? నైతిక బోధన, నైతిక ఆచరణ అనేవి ప్రభుత్వాల పని కాదు అనుకునేపక్షంలో మరి ఇవన్నీ నియంత్రించాల్సింది ఎవరు..? సమాజానికి స్వీయనియంత్రణ సాధ్యమేనా..?

320కిలోల బంగారం బహుమతిగా పంచిన మలబార్ గోల్డ్ అండ్‌డైమండ్స్

ఉభయ తెలుగురాష్ట్రాల్లో 62కిలోల పంపిణీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ప్రపంచ ఖ్యాతి గాంచిన మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ దీపావళి సీజన్లో 320 కిలోల బంగారాన్ని వినియోగదారులకు బహుమతిగా అందించింది. అక్టోబర్ 16నుంచి నవంబర్ 26వరకు దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ ఈ ఆఫర్ అమలుచేశారు. ప్రారంభంలో 250 కిలోలుగా ప్రకటించినప్పటికీ వినియోగదారుల కొనుగోలు నమూనా ఆధారంగా 320 కిలోలుగా పెంచారు. ప్రతి పదివేలు విలువచేసే బంగారం కొనుగోలుపై ఒక బంగారునాణెం, పదివేలు విలువచేసే వజ్రాల కొనుగోలుపై రెండు బంగారు నాణాలు వినియోగదారులకు అందచేశారు ఈ ఆఫర్‌లో భాగంగా ఒక్క కేరళ రాష్ట్రంలో 143 కిలోల బంగారాన్ని బహుమతిగా అందచేశారు. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణల్లో 62 కిలోలు, కర్ణాటకలో 58కిలోలు, తమిళనాడులో 26కిలోలు, ఢిల్లీలో 13 కిలోలు, మిగిలిన ప్రాంతాల్లో 17కిలోల బంగారం అందచేయడం జరిగింది.

అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు



తూర్పు గోదావరి : ఎటపాక మండలంలోని వెంకటరెడ్డి పేట సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. భద్రాచలం నుండి నెల్లిపాక వెళ్తున్న కారు అదుపుతప్పి తిరిగి నెల్లిపాక నుండి భద్రాచలం వస్తున్న ఆర్‌టిసి బస్సును వెనుక భాగంలో ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన స్పైస్ జెట్ విమానం



హైదరాబాద్ : సాంకేతిక లోపం తలెత్తడంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి తిరుపతికి వెళ్ళాల్సిన స్పైస్ జెట్ విమానాన్ని శంషాబాద్‌లోనే అధికారులు నిలిపివేశారు. శనివారం తెల్లవారుజామున ఫ్లైట్ బయలుదేరాల్సి ఉంది. అయితే ఫ్లైట్ బయలుదేరే సమయానికి రెండు ఇంజన్లలో ఓ ఇంజన్ పని చేయకపోవడంతో నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ విమానంలో తిరుమల జేఈవో శ్రీనివాసరాజు ఉన్నట్లు సమాచారం.


కొలంబియా పోలీస్ అకాడమిపై ఉగ్రదాడి

21 మంది మృతి, 68 మందికి గాయాలు



కొలంబియా: పోలీస్ అకాడమిపై ఉగ్రవా దులు పంజా విసిరారు. ఈ ఘటనలో 21 మంది మృతిచెందగా, 68 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొగోటా పోలీస్ క్యాడెట్ ట్రైనింగ్ అకాడమీలో శుక్రవారం కారు బాంబు పేలింది. పోలీస్ క్యాడెట్ల ప్రమోషన్ కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి పేలుడు పదార్థాలతో నింపిన కారును అతివేగంగా దూసుకొచ్చి ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఉగ్రవాది సహా 21 మంది మృతి చెందారు. కారులో 80 కేజీల పేలుడు పదార్థాలు ఉన్నట్టు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దీన్ని తీవ్రవాద దాడిగా కొలంబియా రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ధారించింది. కొలంబియాలో ఈ స్థాయిలో భారీ బాంబు పేలుడు ఘటన చోటు చేసుకోవడం గత 16 ఏండ్లలో ఇదే మొదటిసారిగా రక్షణ శాఖ అధికారులు తెలిపారు. తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ దూక్యూ ట్వీట్ చేశారు. ఈ పేలుడుకు కారణమైన ప్రధాన సూత్రధారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు



ముంబయి: కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్టు కనిపించిన పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 17 పైసలు, డీజిల్ పై 19 పైసలు పెరిగింది. వర్తక వాణిజ్యాలకు కేరాఫ్ అడ్రస్ అయిన ముంబయిలో పెట్రోల్ 17 పై డీజిల్ పై 20 పై పెరిగింది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్ లో పెట్రోల్ ధర 19 పై.లు (రూ.75.01) డీజిల్ ధర 22 పై.లు (రూ.74.90) గా ఉంది. విజయవాడలో పెట్రోల్ ధర 16 పై.లు (74.90), డీజిల్ ధర 26 పై.లు (70.34)లకు పెరిగింది.

గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు



అనంతపురం: అనంతపురం జిల్లా కొత్తచెరువులో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో ఇంట్లో నిద్రిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే ధర్మవరం ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. గాయాలపాలైన వారిలో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

వేలీజ్ సంద్ర ?:

టీడీపీ సమావేశాలకు డుమ్మా
ప్రమాణ స్వీకారానికి గైర్హాజరే




తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన కొత్త ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే టీఆర్‌ఎస్‌లోకి చేరేందుకు తట్టా బుట్టా సర్దేసు కున్నారనే వార్తలు వచ్చాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య - అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పార్టీ మారుతారంటూ ఊహాగానాలు పెద్ద ఎత్తున్నే సాగాయి. అయితే ఈ చేరిక హఠాత్తుగా ఆగిపోయింది. మెచ్చా నాగేశ్వరరావు తాను పార్టీ మారడం లేదని ప్రకటించారు. అయితే మరో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఇటు అసెంబ్లీకి రాకపోవడం...అటు టీడీపీ సమావేశాల్లో పాల్గొనకపోవడం..అదే సమయంలో టీఆర్‌ఎస్‌లో చేరకపోవడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీడీపీ తరపున గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరైన సండ్ర వెంకటవీరయ్య తన అనుచరులు - నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సత్తుపల్లిలో సమావేశం ఏర్పాటు చేసుకొని టీఆర్‌ఎస్‌లో చేరికకు సిద్ధమైపోయినట్లుగా ప్రచారం జరిగింది. దీనికి సంబంధించి గులాబీ పార్టీలోని ముఖ్య నేతలతో సంప్రదింపులు కూడా చేసినట్లుగా వార్తలు వచ్చాయి. అనంతరం ఆయన అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో చర్చించి పార్టీ మారడంపై ప్రతిపా దించారు. అయితే సండ్ర ప్రతిపాదనకు నాగేశ్వరరావు నో చెప్పినట్లు సమాచారం. ఇలా చర్చోపచర్చలు జరుగుతున్న సమయంలోనే అసెంబ్లీ సమావేశాలు వచ్చాయి. ఈ సమావేశాల్లో తొలిరోజు - మరుసటి రోజు కూడా సండ్ర సభకు రాలేదు. ఆఖరికి ఎమ్మెల్యేగా కూడా ప్రమాణస్వీకారం చేయలేదు.

మెట్రో ప్లానింగ్ ఆఫీసర్‌గా సాయిబాబు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా రాజమండ్రి రీజినల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ సాయిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తరులు విడుదలచేసింది. సాయిబాబా రాజమండ్రి కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా ఉన్న సమయంలో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. అనేక అనధికారిక సెల్లార్లను ఎన్ని వత్తిడులు వచ్చినా తట్టుకుని తొలగించారు. అలాగే గోదావరి పుష్కరాల్లో విధులు నిర్వహించడం, గుడాకు కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

బస్సుకు నిప్పు పెట్టిన ఆకతాయిలు



హైదరాబాద్: నగరంలోని టపాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకతాయిలు చెలరేగారు. తాళ్లగడ్డ దర్గా వద్ద నిలిపి ఉన్న ప్రైవేటు బస్సుకు దుండగులు నిప్పుపెట్టారు. మంటల్లో బస్సు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

పిట్స్‌బర్గ్‌లో కాల్పులు




పిట్స్‌బర్గ్: అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్‌లో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి కాల్పులు జరిగాయి. ఈస్ట్‌హిల్స్‌లోని ఫ్యామిలీ డాలర్ స్టోర్‌లో ఒక వ్యక్తి తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రెండు ఫ్యామిలీ డాలర్ స్టోర్లలో దొంగతనం జరిగింది. రెండోస్టోర్లో దొంగతనం సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకొన్నాయి.

విదేశీ పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్



వాషింగ్టన్ : అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ కారణంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో వచ్చే వారం వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ జరుగనుంది. ఈసదస్సుకు ట్రంప్ హాజరు కావడంలేదని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ వెల్లడించారు. అమెరికా-మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం కోసం 5.6బిలియన్ డాలర్లు అవసరమని ట్రంప్ కోరారని అన్నారు. అయితే, డెమోక్రటిక్ పార్టీ సెనెటర్లు ట్రంప్ అభ్యర్థనను తోసిపుచ్చారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటామంటూ నినాదాలు చేశారు. గోడ నిర్మాణానికి నిధులు రాబట్టాలని ట్రంప్ పట్టుబట్టారు. గతనెల22 నుంచి అమెరికాలో పాలన స్తంభించింది. వేతనాలు లేకుండానే 8లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గతే డాది దావోస్ సదస్సుకు ట్రంప్ హాజరయ్యారని, ఈఏడాది యూఎస్‌లో కొనసాగుతున్న షట్‌డౌన్ కారణంగా ఈ సదస్సుకు దూరమవుతున్నారని శాండర్స్ చెప్పారు. అయితే, ట్రంప్‌కు బదులుగా అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పోంపియో, ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్ న్యూచిన్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరవుతారని శాండర్స్ తెలిపారు. ఈనెల22న జరగనున్న ఈ సదస్సులో పోంపియో ప్రారంభోపన్యాసం చేస్తా రని చెప్పారు. ఇదిలా ఉండగా, అమెరికాలో కొనసాగు తున్న షట్‌డౌన్ కారణంగా ట్రంప్ మానసిక వేదనకు గురవు తున్నా రు. హౌస్‌స్పీకర్ నాన్సీ పెలోసి జర్మనీ, ఈజిప్టు, అఫ్ఘని స్తాన్ దేశాల్లో పర్యటించాల్సి ఉంది. షట్‌డౌన్ కారణంగా ఆమె ను కూడా తన పర్యటనను వాయిదా వేసుకోవాలని ట్రంప్ కోరారు.

20 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్



అమరావతి: నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టి వల్‌ను ఈ నెల 20 నుంచి మూడు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

కుక్కలు, పందులకు బలైన చిన్నారి..!!

నెల్లిమర్ల యాతవీధిలో ఘటన

విజయనగరం, నెల్లిమర్ల : ఏ తల్లి కన్నబిడ్డో... నడిరోడ్డుపై కుక్కలు, పందులకు ఆహారంగా మారిపోయింది. ఆడపిల్లని భారంగా భావించారో... పరువు పేరుతో నిర్దాక్షిణ్యంగా విసిరేశారో... నెల్లిమర్ల యాతవీధిలో ఓ పసికందు విగతజీవిగా పడి ఉంది. ఓ వైపు దట్టంగా కురుస్తున్న మంచు... మరోవైపు చలిగాలులకు కన్ను కూడా తెరవని ఆ చిన్నారి ఏడుపు సమీప కుటుంబాల చెవిన శుక్రవారం వేకువఝామున పడింది. తలుపుతెరుచుకుని వచ్చి చూస్తే ఆ శిశువును చీల్చేస్తున్న పందులు కనిపించాయి. వెంటనే ఆ పందులను తరిమి చిన్నారిని కాపాడేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. ప్రాణాలు వదిలిన ఆ చిన్నారిని వారే శ్మశానంలో పూడ్చిపెట్టారు. నెల్లిమర్ల పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ ఎదురుగా యాతవీధిలో ఖాళీగా నున్న ప్రదేశంలో ఆ పసికందును ఎవరో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు విసిరేసినట్టు తాను చూశానని ఓ బాలుడు చెబుతున్నాడు. కనీసం బొడ్డు కూడా కోయకుండా తీవ్రమైన చలిలో పడేశారు. అక్కడే సంచరిస్తున్న పందులు, కుక్కలు చిన్నారిని చీల్చుకు తిన్నాయి. సంఘటన చూసిన స్థానికులు చలించిపోయారు.





గర్వంగా ఉంది మై లవ్

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా చరిత్ర సృష్టించింది. తిరుగులేని ఆటతో కంగారూలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శిం చింది. శుక్రవారం జరిగిన చివరి వన్డేలో గెలిచి.. అన్ని సిరీస్‌ల్లోనూ అజేయంగా నిలిచింది. ఈ సందర్భంగా భారత ఆటగాళ్లపై క్రికెట్ అభిమానుల నుంచి ప్రముఖుల వరకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీమిండియా సారథి విరాట్ కోహ్లీ సతీమణి, బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా కోహ్లీ సేనను పొగడ్తలతో ముంచెత్తారు. 'నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది మై లవ్' అంటూ భర్తను ప్రత్యేకంగా ప్రశంసించారు. 'మరుపురాని, అద్భుతమైన పర్యటన ఇది. టీమిండియా చారిత్రక విజయాలను ప్రత్యక్షంగా చూసినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

పోలమాంబ జాతరకు శ్రీకారం

21నుంచి ఉత్సవాలు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : జీవీఎంసీ 21వ వార్డు కుమ్మరివీధిలో బహుముఖ రూపాల్లో వెలసిన శ్రీ పోలమాంబ అమ్మవారి రాట మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈరాట మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఉత్సవాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురవకుండా చూడాలని అమ్మవారిని ప్రార్ధించారు. ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆలయకమిటీ, శ్రీపోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు 21వతేదీనుంచి 23వ తేదీవరకు జరుగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేషపూజలు, అలంకరణలు చేస్తున్నట్టు నిర్వాహణ కమిటీ సభ్యుడు డొంక సత్యనారాయణ తెలిపారు. ఈ ఉత్సవాల్లో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, వైసీపీ నాయకుడు పివిఆర్ మూర్తి, బీజేపీ నాయకులు, సిఎంఆర్ అదినేత మావూరి వెంకటరమణ, అన్న ఎన్టీఆర్ సేవా సమితి ప్రతినిధులు వేగి రాధాకృష్ణ, యల్లా సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, యోగి, అప్పలరాజు, బిఎస్ ప్రకాష్, విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, సీనియర్




జర్నలిస్టులు, నగరంలోని ప్రముఖ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ ప్రతినిధులు, స్థానిక పెద్దలు, మహిళా కమిటీ సభ్యులు, భక్తులు హాజరవుతారన్నారు.

ఏర్పాట్లలో కమిటీ సభ్యులు....

శ్రీ పోలమాంబ 60వ పరస మహోత్సవాలను ఘనంగా నిర్వహించి భక్తులు, పుర ప్రముఖుల అభినందనలు అందుకున్న కమిటీ సభ్యులు 61వ మహోత్సవాలను మరింత ఘనంగా నిర్వహించ డానికి సన్నద్ధమవుతున్నారని శ్రీపోల మాంబ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డొంక సత్యనారాయణ తెలిపారు. కమిటీ గౌరవ సభ్యులు ఎం తాతయ్యలు, డిఅప్పల నరసయ్య, ఎర్రింటి సత్యనారాయణ సూచనలతో కమిటీ సభ్యులు రాజా, వాణి, కిరణ్, అప్పలరాజు ఏర్పాట్ల గురించి వివరించారు.

భారతీయుడు-2

ప్రారంభం



దర్శకుడు శంకర్, నటుడు కమల్‌హాసన్ కాంబినేషన్‌లో 22 ఏళ్ల క్రితం విడుదలైన 'భారతీయుడు' చిత్రానికి ఇప్పుడు 'భారతీయుడు 2' పేరుతో సీక్వెల్ తెరకెక్కుతోంది. లైకా నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. 'భారతీయుడు'లో 'ఇండియన్ తాత'గా మెప్పించిన కమల్ మళ్లీ అదే పాత్రలో కనిపించ నున్నారు. ఈ పాత్ర మేకప్ కోసం హాలీవుడ్ నుంచి ప్రత్యేక నిపుణుల్ని తీసుకొచ్చారు. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం చెన్నైలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.ఎమ్.రత్నం, కాజల్, సుభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు. శంకర్ ఈ సినిమాను వీలైనంత త్వరలోనే విడుదల చేయనున్నారని సమాచారం.

సమాజసేవలో యువత ముందుండాలి

ఎలమంచిలి, న్యూస్‌లీడర్: నేడు సమాజంలో ప్రజలకు ప్రధాన వనరులలో రక్తనిధి ఒక్కటని ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదినోత్సవ వేడుకలు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల ప్రారంభించి మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు ఎక్కువగా ఖర్చు చేసే కంటే ప్రజలకు ఉపయోగపడే విధంగా రక్తదాన శిబిరాలు, యువకులకు ఉత్సాహాన్ని కలిగించే వాలీబాల్ పోటీలు పెట్టడం చాలా మంచి కార్యక్రమం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆడారి శ్రీధర్ మాట్లాడుతూ రేపు జరగబోవు ఆనంద్ జన్మదినోత్సవానికి రక్తదాన శిబిరంతో పాటు మూడు రోజులుగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, విజేతలకు ఆదివారం బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. ఐదువేల మంది పింఛనర్లకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి పెంచిన పింఛన్ పత్రాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణపార్టీ కార్యదర్శి పిట్టా శ్రీను, టీడీపీ నాయకులు ఆడారి వెంకట్, కౌన్సిలర్లు యల్లపు గోపీ, బొడ్డేడ చంద్రరావు, దవులూరి పెంటయ్య, బొద్దపు రమణ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660909, 93485 50909**